Regd. No. H-18.

విడిప్రతి 30 పైసలు.

శుక్రవారం 4-6-71

'నిర్మల'
దీలక్సు వక్కపొడి
పెండ్లిండ్లకు
ప్రత్యేకము

ట్రంకురోడ్డు - నెల్లూరు,
టెలిఫోన్: 795, 796.

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడుగారు

సంపుటి 43 సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి సంచిక 22

**WANTED**

"Andhra Medical Agencies (Regd.), Trunk Road, Nellore (Phone 210)"

WANTED A SALESMAN who can give business guarantee and Security. Decent Salary and battas will be paid.

తమిళులనుండైనా నేర్చుకోవాలి!

# నూత్నసందేశం ఇవ్వలేని తెలుగు రచయితల సభలు

## వెంకటరంగయ్య సంఘం ఏమిచేసింది?

రెండేళ్ళకు మూడేళ్ళకు ఒక సారి దొవ్వున అఖిలభారత తెలుగు రచయితల మహాసభను జరిపించడం పరిపాటై పోయింది. ఇందుకోసం హైదరాబాదులో ఒక సంఘమున్నది. దీనికి దామోదరం సంజీవయ్యగారు శాశ్వతాధ్యక్షుడు. పోతుకూచి సాంబశివరావుగారు శాశ్వత కార్యదర్శి. సాంబశివరావుగారు ఆయన మిత్ర బృందం సాహితీపరులే. అంతకుమించి వారు సాహితీ కార్యకర్తలు, రాజకీయ కార్యకర్తలులాగా. 1960 లో సంజీవయ్యగారు రాష్ట్ర ముఖ్యమంత్రి యైనప్పుడు ఇలాంటి మొదటి మహాసభ ఇక్కడే జరిగింది. దానికి అప్పటి ఉపరాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు ప్రారంభోత్సవం చేశారు. అప్పటినుండి సంజీవయ్యగారే అధ్యక్షుడుగా వుంటున్నారు. తిరుపతి, రాజమండ్రిలోకూడా ఈ సభలు జరిగాయి. 1968 లో ఇక్కడే జరిగాయి. ఆ తరువాత మళ్ళీ హైదరాబాదులోనే క్రితంవారం ఐదవ మహాసభలు జరిగాయి.

అఖిల భారతస్థాయిని రచయితల సభలు జరుపుకొనడం బెంగాలీ, మరాఠీ వారికి అచారం. పది పన్నెండేళ్ళ క్రితం అఖిలభారత బెంగాలీ మహాసభ హైదరాబాదులో జరిగింది. బహుశా దాన్నిచూసిన తరువాతనే ఇలాంటి మహాసభ తెలుగు భాషకు సంబంధించికూడా జరిపించాలనే సంకల్పం కార్యశీలురైన పోతుకూచి ప్రభృతులకు కలిగివుంటుంది.

ఇలాంటి సభలు జరిపించడంలో ఒక ప్రధానోద్దేశం- వివిధ ప్రాంతాల్లో వుంటున్నటువంటి ఒకే భాషారచయితలను సమావేశపరచి భాషాసంస్కృతుల ఔన్నత్యానికి దోహదంచేయటం. ఇలాంటి సభలు స్వభాషేతర ప్రాంతాల్లోకూడా జరిగితే స్థానిక భాషారచయితలతో మేధావులతో పరిచయంకలిగి దేశ సాంస్కృతిక సమైక్యతకుకూడా దోహదంకలుగుతుంది. ఇంత వరకు తెలుగు రచయితల మహాసభ


**మా హైదరాబాదు విలేఖరి**

ఆంధ్రేతర ప్రాంతంలో జరిగినట్టులేదు. వచ్చే మహాసభలైనా ఢిల్లీ, బొంబాయి కలకత్తా, ఖరగ్‌పూర్, నాగపూర్ లాంటి కేంద్రాల్లో లేక పొరుగురాష్ట్రాలైన తెలుగు జనాభావున్న తమిళనాడు, మైసూరు, ఒరిస్సాలలో జరిపించడానికి ప్రయత్నిస్తే తెలుగు భాషాసంస్కృతుల ప్రతిపత్తి ఇనుమడించడానికి సహాయం కలుగుతుంది.

ఈ సమావేశాలు ఇప్పటికి పదిసంవత్సరాలనుంచి జరుగుతున్నప్పటికీ, నూత్న సందేశమేదీ రచయితలకు లభ్యం కావడం లేదు. గోష్ఠులు వగైరా జరుగుతున్నాకూడా నూత్న సాహితీవిలువల ప్రతిష్ఠాపన పోషణ జరుగుతూన్నట్టు కనిపించదు. ఎంతోశ్రమకోర్చి ఈ సభలను జరిపిస్తున్న వ్యవస్థాపకులీవిషయమై కొంత అధ్యయనం చేయడం అవసరం. ఎవరి ధాందసాలను వారు ప్రకటించడంవినా సమిష్టి ఆలోచన పరిశీలన జరగడు. ఎన్నోవిధాల తెలుగు భాష ప్రత్యేకతకలది. ఒక్క ఉర్దూతప్ప ఇతర ఏ భారతీయ భాషకూడా ఇతర భాషాపదజాలాన్ని తెలుగులా తనలో ఐక్యం చేసుకోలేదు. మన కథలు కవిత, దేశంలోని ఏ ఇతర భాషాకథలు కవనానికి తీసిపోవు. ఐనాకూడా మన భాషౌన్నత్యం గూర్చి, దాని విస్తృతి, భారతీయ సంస్కృతి సంపదకు అది చేస్తున్న సేవగూర్చి ఇతర భాషలవారికి బాగా తెలియదు. ఇందుకు బాధ్యులెవరనేది ప్రశ్నకాదు. ఇందుకు కృషి ఎక్కడ ఎవరిచే ప్రారంభం కావాలనేది ప్రశ్న. ఇందుకు సమాధానం ఏ అఖిలభారత తెలుగు రచయితల మహాసభలోను లభ్యంకాకపోవడం అన్యాయం.

ఇది ఇలా వుండగా తమిళులు ప్రపంచ తమిళ మహాసభ జరిపించి, తెలుగు రచయితల మహాసభ వ్యవస్థాపకులకు కొత్త సంకల్పాన్ని కలిగించారు. 1968 నాటి మహాసభకు మారిషస్‌నుంచి తెలుగు ప్రతినిధులు హాజరయారు. ఈసారి సభలకు కూడావచ్చారు. మారిషస్‌లో తెలుగుజనాభా వుంది. వీరంతా క్రితం శతాబ్దాలోను ఈ శతాబ్దారంభంలోను అక్కడికి జీవనోపాధి

—కొరవ 6 వ పేజీలో



# శ్రీ వెంకటగిరిరాజా కాలధర్మం

వెంకటగిరి రాజాసాహెబ్ శ్రీ రాజా వెలుగోటి సర్వజ్ఞ కుమారకృష్ణయాచేంద్ర బహద్దూర్, కొంతకాలంగా అస్వస్థులుగా వుంటూ, 1తేది రాత్రి 11-30 గంటలకు మద్రాసులో కాలధర్మం చెందారు. వారి వయస్సు 72 సంవత్సరాలు వారికి సతీమణి, ఆరుగురు కుమారులు వున్నారు. శాసనమండలి సభ్యులు శ్రీ కుమార రాజా, సమితి మాజీ అధ్యక్షులు శ్రీ రాజకుమార్ వారి పుత్రులు. రాజాగారి పార్థివకాయం వెంకటగిరికి తీసుకరాబడి, 2తేది అంత్యక్రియలు జరిగాయి.

రాజాసాహెబ్ జస్టిస్‌పార్టీ ప్రముఖుడు; బ్రిటిష్ ప్రభు భక్తుడు. కాని స్వరాజ్యానంతరం, వారు పార్టీలో చేరకపోయినా, కాంగ్రెస్ అభిమానిగానే వుంటుండినారు. ఆయన కుమారులిరువురు కాంగ్రెస

—కొరవ 6 వ పేజీలో

శ్రీ వెంగమాంబ జి. ప. ఉన్నతపాఠశాల - నర్రవాడ

పూర్వ విద్యార్థి సంఘమువారి అధ్వర్యమున

**ఆటలు, ఏకపాత్రాభినయం పోటీలు**

చెడుగుడు, వాలీబాల్, బ్యాడ్‌మింటన్, ప్రవేశరుసుము రూ. 6-00 6-00, 5-00 లు (వరుసగా) ప్రైజులు; ఒక్కొక్క ఆటకు రోలింగు కప్పు మరియు రూ. 116 రొఖ్ఖబహుమతి. జరుగు తేదీలు జూన్ 13 నుండి 16 వరకు, అప్లికేషన్లు ఆఖరుతేది జూన్ 10.

ఏకపాత్రాభినయమునకు రుసుము 5-00, ప్రైజు రూ. 50. ఒంగోలు నెల్లూరుజిల్లాలవారు మాత్రమే పాల్గొనవలెను. ముందుగా ప్రవేశ రుసుము పంపనివారిజట్టు డ్రాలో చేర్చబడదు.

మూడాల చంద్రశేఖర్,

President V. Z. P. H. S., O. B. A.
నర్రవాడపోస్టు, ఉదయగిరి తాలూకా, నెల్లూరుజిల్లా.

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

(Union Bank of India)

(స్థాపితం: 1919)

[హెడ్డాఫీసు: 66/80 అపోలోస్ట్రీట్, ఫోర్ట్, బొంబాయి-1]

**10-6-1971 తేది**

**— నెల్లూరులో బ్రాంచి —**

ప్రారంభిస్తున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము.

నెల్లూరు బ్రాంచి కార్యాలయము: సంతపేట మెయిన్‌రోడ్డు

పి. వి. చార్లు (చీఫ్ ఏజంటు)

ఎ. ఎస్. గట్టా (కస్టోడియన్)

త్వరలో వెలువడుతున్నది

సాహిత్యప్రియులు సమాదరించతగిన

## చంద్రికకథ

[తెలుగు మహాపురుషుడు వీరేశలింగం గార్ని గూర్చి తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి వ్రాసిన నవలకు మేలి తర్జుమా.]

***

ఆమధ్య 'జమీన్‌రైతు'లో సీరియల్‌గా వచ్చిన ఈ నవల పరిష్కరణ పొంది మొదటిసారిగా పుస్తకరూపంలో వస్తున్నది. వీరేశలింగంగారిపై కొత్తవెలుగును ప్రసరింపచేస్తున్న కె. వి. రమణారెడ్డి, డాక్టర్ బిల్లా రాధాకృష్ణశర్మ, బం గో. రెడ్డి అనుశీలన వ్యాసాలు జతచేయబడివున్నవి.

వెల: రూ. 2-50 పైసలు.

— ప్రతులకు —

బంగోరె,

జమీన్‌రైతు - నెల్లూరు.



## "కామకోటి"

తెలుగు మాసపత్రిక

(శ్రీ కంచి కామకోటి జగద్గురు శంకరాచార్య మహాపీఠమున ప్రకటింపబడునది)

— వలయువారు —

METROPOLIS

NEWS HOUSE.

Trunk Road - Nellore.

వారిని సంప్రతించవలసినది.



## ఇండ్లప్లాటులు

నెల్లూరుటవున్ మూలపేటలో జిల్లాజడ్జిగారి బంగ్లా స్థలంలో శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారి యింటికి ఎదురువైపు) షుమారు 173 అంకణములు కాళీస్థలము అమ్మబడును. మొత్తముగాగాని, బిట్లుగాగానీ అమ్మబడును. కింద బొంతరాతి చట్టు, మంచినీరు పైనే దొరకును. స్థలమునకు దక్షిణపు తూర్పు వీధులు పడమట జడ్జిబంగళా కాంపౌండు గోడ. Lay out ప్రకారం తూర్పు పార్కు యుండును. వలయువారు-

శ్రీ యం. సుందరాచారి,

అడ్వకేటు,

16/1928, శ్రీనివాస అగ్రహారం,

నెల్లూరు.

తో సంప్రదించవచ్చును.








## జమీన్‌రైతు

| | |
|---|---|
| సంవత్సరం చందా | రు. 15-00 |
| 6 మాసములకు | రు. 8-00 |
| విడిప్రతి | రు. 0-30 |



# ★★ జమీన్‌రైతు ★★

శ్రీ విరోధికృతు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుక్రవారం 4-6-71


# కాకులను కొట్టి....

మనదేశంలో బడ్జెటుకు పర్యాయపదం పన్నులు. పన్నులు లేకుండా బడ్జెటు వుండదు. పన్నులులేని బడ్జెటులో సారముండదని మన ఆర్థికమంత్రుల అభిప్రాయం. అందువల్లే ప్రతి ఆర్థికమంత్రి పన్నులు పెంచడానికుండే అనువులను అన్వేషిస్తుంటాడు; అదే తనపని అనుకుంటుంటాడు. ఏ ఆర్థికమంత్రైనా అంతే. సోషలిస్టు చవాన్ అంతేనని తేలింది.

ఈసారి కేంద్రప్రభుత్వం 177 కోట్ల రూపాయల మేరకు పన్నులు వేస్తున్నది. ఇందులో పరోక్షపన్నులే, అంటే సామాన్యప్రజలమీద నిత్యం పడే పన్నులే, 132 కోట్ల వరకు వున్నవి. ఏఏ వస్తువులమీద పన్నువేశారనేది చూచేబదులు, దేనిదేనిమీద వేయలేదో వెతకడం బాగుంటుంది. నబ్బులు, గుడ్డలు, రొట్టెలు, కిరసనాయిలు; పెట్రోలు, ఇతర ఇంధనాలు; ట్రాక్టర్లు- ఒక్క వస్తువుమీదకాదు, ఒకవర్గం మీదకాదు- అన్ని వస్తువుల మీద, అందరి ప్రజలమీద విరుచుకపడడం జరిగింది. పేదరికాన్ని పారద్రోలడానికి బదులు, దరిద్రాన్ని పెంచడానికి ఈ బడ్జెటు దోహదకారి అవుతుందంటే అతిశయోక్తి కాదు. ఇన్నిపన్నులు వేసినా, లోటుపూడలేదు. దాదాపు 220 కోట్ల రూపాయలు భర్తీకాకుండానే మిగిలిపోతుంది. దీన్ని భర్తీ చేయడానికి నోట్లే శరణ్యం. నోట్లు ముమ్మరం కావడమంటే, ధరలు పెరగడమని అర్థం. ఇప్పుడున్న ధరలే భరించలేకుంటే, ఇక పెరిగే ధరలతో ప్రజలు బ్రతకగలరా అనే భయసందేహాలు కలుగుతున్నాయి

అభివృద్ధి కార్యక్రమాలకోసం, దేశం ప్రగతికోసం ప్రతిఒక్కరూ కష్టాలుభరించాలని, త్యాగాలు చేయాలని పాలకులు ప్రబోధిస్తుంటారు. ఆ ధర్మోపదేశాలు మనకేనని, పాలకులకు కాదనుకోండి! వారి హితబోధ ప్రకారం పన్నులు భరించవచ్చు, కష్టాలు పడవచ్చు, త్యాగాలూ చెయ్యొచ్చు. కాని ఇవన్నీ బూడిదలో పోసిన పన్నీరైపోతున్నాయి. ప్రణాళికలమీద, అభివృద్ధి కార్యక్రమాల మీద, ప్రభుత్వ పరిశ్రమలమీద చేయబడుతున్నవ్యయంలో ఎంతో భాగం దోపిడి చేయబడుతున్నది, దండగై పోతున్నది. కాకులనుకొట్టి, గ్రద్దలకు వేయడంగా వుంటున్నది. కడుపు మాడ్చుకొని, సుఖాలు మానుకొని చెల్లించేడబ్బు ఈ విధంగా దుర్వ్యయమైపోవడం- ప్రజలకు పన్నులు భరించేదానికంటే, బాధాకరంగా వుంటున్నది. శుభ్రమైన, నిరివంతమైన, నిజాయితీతో కూడిన, సమర్థవంతమైన, పరిపాలనను ఇవ్వలేక, ఇచ్చేదానికి ప్రయత్నంకూడా చేయక; కొన్నివర్గాలు, కొందరు వ్యక్తుల దోపిడిని అరికట్టలేక- ప్రజలను ఈ విధంగా వేధించుకతినడం; అందులో, సోషలిజం తెస్తామనిచెప్పి ఓట్లుతీసుకొని, పన్నులు నెత్తినవేయడం క్షమించరాని నేరమవుతుంది. తారతమ్యాలను తగ్గిస్తామన్న ప్రభుత్వం, అది చేయకుండా, సామాన్యప్రజలకు శాపంగా తయారు కావడం విచారకరం.

రైల్వేచార్జీలు పెరిగాయి; బస్‌చార్జీలు పెరగబోతాయి; ప్రాణానికొచ్చి టాక్సీలో పోదామన్నా అందుబాటుకాదు; సబ్బుబిళ్ళ కొందామంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించవల్సివస్తుంది; రోగికిరొట్టె, పిల్లలకుబిస్కెట్లు ధారాళంగా తెచ్చివ్వలేము; పేదవాడి కిరసనాయిల్ దీపం ఖరీదైపోతుంది; మధ్యతరగతివాడు విద్యు

## ఢిల్లీబ్యాంకి కుంభకోణం

ఢిల్లీ స్టేట్‌బ్యాంకిలో 60 లక్షల రూపాయల దగా వ్యవహారం విభ్రమాన్ని కల్గిస్తుంది. మోసగాడు నగర్‌వాలా నేరాన్ని ఒప్పుకొని వుండవచ్చు; అతనికి వెన్వెంటనే శిక్ష విధింపబడి వుండవచ్చు; బ్యాంకి క్యాషియర్ మల్హోత్రా సైతం అరెస్టు గావింపబడి వుండవచ్చు; కడకు బ్యాంకి ధనం చిల్లిగవ్వపోకుండా దొరికివుండవచ్చు. కాని ప్రజల్లోవున్న అనుమానాలు, ఊహాపోహలు మాత్రం తొలగిపోలేదు. ఇంత తీవ్రమైన మోసం వెనుక ఏవో లోతైన విషయాలు వుండితీరాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఈ కుంభకోణానికి సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రాలేదు. పార్లమెంటు చర్చల్లోకూడా బయటపడలేదు. నేరస్తుడు నేరాన్ని ఒప్పుకోవడం, క్షణంలో అతనికి శిక్షపడడం-ఇవి అనుమానాలను మరింతగా ఎక్కువ చేస్తున్నాయి. నగర్‌వాలాకు - బ్యాంకి ఫ్యాన్ల క్రింద చల్లగా కూర్చున్న సమయంలో అప్పటికప్పుడు కలిగిన దుర్బుద్ధి అంటే నమ్మలేకున్నారు. దాన్ని నమ్మినా, ఎవరో ఫోన్‌చేసినంతనే, ఆ గొంతు ప్రధాని గొంతుగా పోలివున్నంత మాత్రాననే, చెక్కు గిక్కు, వోచర్‌గీచర్ గుర్తుగిర్తు ఏమీలేకుండా, బ్యాంకి క్యాషియరు అంత పెద్ద మొత్తాన్ని చంకన పెట్టుకొని ఆ సంకేత స్థలానికి పరుగెత్తడమనేది విడ్డూరమేకాదు, విపరీతమని కూడా చెప్పవలసివుంటుంది. ఇటువంటి సంఘటన ఎప్పుడైనా జరిగిందా? ఎక్కడైనా జరుగుతుందా? ప్రధాని సంగతి పోనీండి; స్టేట్‌బ్యాంకి అధికారిగావుండే వ్యక్తి ఫోనులో ఆదేశించినామాత్రం ఈ విధంగా డబ్బు తీసుకపోవడం జరుగుతుందా? అసలు 60 లక్షలు కాదు, అరవై రూపాయలైనా బ్యాంకివుద్యోగి బ్యాంకినో కాకుండా, బయటకుతీసుకపోయి ఇవ్వడం జరుగుతుందా?

ఢిల్లీ స్టేట్ బ్యాంకిలో మొన్న జరిగిన దగాకు సంబంధించి, ప్రతి ఒక్కరిలో పొడచూపుతున్న అనుమానమేమంటే- ఈ బ్యాంకులో ఇటువంటి కుంభకోణపు వ్యవహారాలు ఇదివరకుకూడా జరిగివున్నాయా? జరక్కుంటేమొన్నమాత్రమే ఎట్లా జరుగుతుంది? ప్రధానిగొంతు గుర్తుపట్టి ఆ విధంగా చేయవలసిన అవసరం ఏమి కలుగుతుంది? ప్రజల్లో ఏర్పడిన ఈ అనుమానం తీరవలసివున్నది. తెర వెనుకభాగోతం ఏమీ లేకుంటే, న్యాయవిచారణకు ప్రభుత్వం విముఖత చూపవలసిన అవసరం ఏమిటి? బ్యాంకుల జాతీయకరణమే ఇటువంటి ఘోరతప్పిదాలకు ఆస్కారమా అనే సందేహం వుంది. అది తొలగిపోవాలంటే అన్ని విషయాలు వెల్లడికావడం అవసరం.

# ఈవారం విశేషాలు

● ఎదురుచూసిన బడ్జెటు వచ్చింది. సోషలిస్టుచవాన్ పన్నుల వజ్రాయుధాన్ని ప్రజలపై రుళిపి దాడు. ఈ బడ్జెటు బాధల్నిగూర్చి మనం ఎంత గింజుకున్నా ఎంత మొత్తుకున్నా లాభంలేదు. మన ప్రభుత్వం చేస్తున్నది దారిద్ర్యంపై యుద్ధం గాదు, దరిద్రులపై యుద్ధం! మన సోషలిస్టు ప్రభుత్వం కోట్లుకోట్లు పెట్టుబడ్డు గుమ్మరించి నిర్వహిస్తున్న బిరావతాలవంటి జాతీయ ఫ్యాక్టరీలు, పరిశ్రమల మూలంగా ఏటేటా వందల వేలకోట్లు నష్టంవస్తుంటే దాన్ని పూడ్చేందుకు ఈవిధంగా పన్నులు దండివేస్తుంటే- వోట్లిచ్చి గెలిపించినందుకు మనం వీటిల్ని వోర్చుకుండాభరించాల్సిందే, మన ఆస్తులు అరిగిపోవాల్సిందే

ఆర్థికమంత్రిగారు కళ్ళుమూసుకుని కనపడ్డదానిమీదల్లా ఇబ్బడిగా ప్రత్యక్ష పరోక్ష పన్నుల్ని దంచికొట్టాడు. వీటిమూలంగా ఈ పదినెల్లకాలాన్ని 220 కోట్ల ఆదాయం రాల్తుందన్నాడు. అంటే నెలకు 22 కోట్లు, అంటే నగటున రోజుకు 1 కోటి చొప్పు ఏన్నమాట ఆయనకు లెక్కలు తేలేసరికి. ఇంత భారీఎత్తున పన్నుల వజ్రాయుధాన్ని రుళిపించినా ఇంకా 200 కోట్ల పై చిలుకు లోటు వుండనే వుంటుందన్నమాట. దీసెక్ చేయడానికి వీల్లేనివిధంగా దివాలాతీసిందన్నమాట మన ఆర్థిక వ్యవస్థ. బోలో భారతీయ సోషలిజానికీ- జై!

● ఢిల్లీ బ్యాంకులో (పంజాబు నేషనల్ బ్యాంకు)లో మళ్ళీ పట్టపగలు 20 వేల రూపాయలు దుండగులు దోచుకున్నారు. ప్రధాని ఇందిరమ్మ పేరుమీదుగా మొన్నవారం జరిగిన 60 లక్షల దోపిడీని ఎనిమిది గంటల్లోనే పట్టేసి ప్రమోషన్ పొందిన ఆ పోలిస్ ఆఫీసరుగారు ఈ దుండగుల్ని ఇంకా ఎందుకు పట్టుకోలేకపోతున్నారో మరి! ఆ 60 లక్షల దోపిడిగూర్చి, తన పేరుమీదుగా జరిగిన ఆ దోపిడీగూర్చి ఇందిరమ్మ ఇంతవరకు ఒక స్టేట్‌మెంటైనా ఇవ్వని పాపాన పోలేదు!

● బీహార్‌లో సం. వి. దళ్ కర్పూరీ ఠాగూర్ మంత్రివర్గం పతనమై పోయి ప్రొ. వి. దళ్‌కు చెందిన శ్రీబోలా పశ్వాన్ శాస్త్రి మంత్రివర్గం గద్దెనెక్కింది. దమ్మిడీకి కొరగాకుండాపోయిన ఈ దళాల పేరుచెప్పుకుని క్షణానికొక మంత్రివర్గం గిట్టుతూ పుట్టుతూవస్తున్న బీహార్ రాష్ట్ర సుస్థిరత, సత్పరిపాలన అనేవి మచ్చుకైనా కానరావడంలేదు. 1967 ఎన్నికలతర్వాత ఇప్పటికి ఎనిమిది కలగాపులగపు మంత్రివర్గాలు మారాయి, అంటే ఆర్నెల్లకోమంత్రివర్గమన్నమాట. సం. సో. పా., జనసంఘ్, సిండికేట్, బి. కె. డి. వగైరా పార్టీలతో అర్థమైనవారికల్లా మంత్రిపదవినిచ్చి మంత్రులసంఖ్యను 50 కి మించి వేసుకుని పరీక్షన్యాయాలాలా స్థిరమైన కోట కట్టుకున్నా కడకు కప్పలతక్కెడ వ్యవహారం విచ్ఛిన్నమైంది కర్పూరీ ఠాగూర్ బలం కర్పూరంలా హరించుకపోయింది. అసలు సం. సో. పా. లోనే ముసలం పుట్టింది మొదట, బి. కె. డి. మద్దతు మానుకున్నది, జనసంఘంవారు జారుకున్నారు, మొత్తం 9 మంది మంత్రులు పరారీనమైనారు. అంతా కొత్తకాంగ్రెస్ వుచ్చుల్లో చిక్కుకున్నారు. ఎస్. వి. డి. పోయి ప్రొ. వి. డి. వచ్చింది. ఈ రెండో ప్రొ. వి. డి. దళంలో కొత్తకాంగ్రెస్, పి. ఎస్. పి., కమ్యూనిస్టు పార్టీ, జార్ఖండ్ వగైరా చిల్లరమల్లర కలగాపులగపు పార్టీలకపై లోక్ తాంత్రిక

—తరువాయి 10 వ పేజీలో

# జనవాణి

## విహార కేంద్రమా? ఇంకేమన్నా నా?

నెల్లూరుకు దగ్గర్లోవున్న మైపాడు ఒక విహార కేంద్రంగా వుందని చెప్పడానికి సంతోషించాల్సిందే. కాని అది ఏ దశలో వుందో దాన్ని అజమాయిషీచేసే విధానమేదో తెలిస్తే చాలా బాధపడాల్సివస్తుంది. మేము ఇటీవల పక్షంరోజులక్రితం అక్కడకుపోతే అక్కడ జరుగుతున్న విషయాలు విద్యార్థులమైన మాకు తమాషాగానే అన్పించినా దాన్నిగూర్చి మంచిమనసుతో ఆలోచిస్తే చాలా విచారించాల్సి వచ్చింది.

ముఖ్యంగా అక్కడవుండే సోకాల్డ్ ప్రభుత్వ అతిథిగృహం (సముద్రానికి దగ్గర్లో 4 రూములతో విరాజిల్లుతుంటేది) వొక వ్యభిచార కేంద్రంగా, త్రాగుబోతుల నిలయంగా, అంటే నవీనధోరణిలో చెప్పాలంటే వొక చిన్నసైజు 'బార్'గా విరాజిల్లుతున్నది. ఇటువంటివాటితో వుండేదేనేమో విహార కేంద్రమంటే!

ఒకరూముకు రోజుకు 2½ రూపాయలు

ఆ ఏ రోజులు అయితే అమ్మాయిలను కొనుక్కున్నారు. అదెంతవరకు నరైందో తెలియదు. అక్కడకుపోయి రూము తీసుకోగానే అడిగినప్రశ్న మీరు ఎవర్నీ తెచ్చుకోలేదా? లేకుంటే మేము తీసుకొస్తాం, రేటు 5 రూపాయలు మాత్రమే-నన్నారు. సామాన్యంగా అక్కడకు విహారం పేరుమీదుగా ఈపనులు చేయాలనుకున్నవారే రూములు తీసుకుంటున్నారేమో.

ఇంకా దీన్ని అభివృద్ధి చేయాలని అంటున్నారు, కాని అది ఏ విధంగానో? ప్రస్తుత ధోరణిలో అయితే అంతకన్న డబ్బు దండగ మరొకటి వుండబోదు దీని మేనేజిమెంటు ఎవరికి సంబంధించిందో, దీనిపైన అజమాయిషీ ఎవరిదో కొంచం విచారిస్తే మంచిది పిస్తుంది.

నెల్లూరు —వి. ఎ. శేషారెడ్డి

▼

## ఈ విహార కేంద్రం ఎవరికి? ఎందుకు?

మైపాడు ప్రభుత్వ గెస్ట్‌హవుస్‌లో రూము రిజర్వుచేసుకోవాలంటే పెద్దతేమిటో అర్థంకావటంలేదు. ఒక ఆదివారంపూట మిత్రులతో కల్సివెళ్తే ఏ ఇ దగ్గర్నుంచి చీటీ తెస్తేనేగాని రూము ఇచ్చేదానికి లేదన్నారు. అప్పుడు రెండుమూడు రూములరెండా పోలిస్ ఆఫీసర్ల బలగం వుండింది. మరోసారివెళ్తే ఎవరో ఆఫీసర్ల బృందం వుండింది చూడబోతే ఇది ఆఫీసర్లకు, ఘరానా వాళ్ళకేగాని మామూలు వాళ్ళకు అందుబాటులో వుండేదిగా కనపళ్ళేదు.

ఒకసారి రూము రిజర్వేషన్ కోసం ఎ. ఇ గారికి ఫోన్‌చేసినమాత్ర ఆయనక్యాంపుకు పోయివున్నారన్నారు ఆయన ఆఫీసుకో వుండేదెప్పుడు? ఆయన దగ్గర్నుండి

—తరువాయి 10 వ పేజీలో

వ్యక్తి వాడుకోవడమూనేరమైపోయింది; ఒకనాటి విలాసంగా, ఈనాటి అత్యవసర సౌకర్యంగావున్న టెలిఫోను వుంచుకోవడమా, పూడపెరికించుకోవడమా అనేదితీవ్రమైనసమస్యగాపరిణమించింది; నాజూకుసంగతి పోనీండి, షుమారుపాటి మేలిరకం గుడ్డకూడా కొనలేక, కొనకుండా వుండలేక నలిగిచస్తున్న మధ్యతరగతి వాడికి- తన భార్యాపిల్లల మానాలు కాపాడడంకూడా భారమవుతుంది. నేటి పరిస్థితులను, బడ్జెటు పన్నులను చూచినప్పుడు విమర్శలు రావడం లేదు, విచారం కలుగుతున్నది; హృదయం బరువవుతున్నది!

## ఓపిక వున్నవారు తూకంవేసి చెప్పండి!

# ప్రధాని ఇందిరమ్మ ఆనాటి నడవడి గొప్పదా?- సంజీవరెడ్డిగారి ఈనాటి నడవడి గొప్పదా?

ఏ వేదికనుంచైనా ఎవరైనా దేశంలోని వామపక్ష (రాడికల్) శక్తులను ఏకంచేసే ప్రకటన వెలువడితే మాకు శ్రవణానంద మది నుడివినాము. అట్టి ప్రకటనకర్తలైన ఇరువురిని అభినందించినాము. అందులో ఒకరు తమ ప్రకటనను చదివినవారు దాని తాత్పర్యాన్ని ప్రాధాన్యాన్ని తీర్చించు కోకముందే, ఏ సంస్థ నుండి తాను ప్రకటన చేసెనో ఆ సంస్థలోనుండి వైదొలగి నట్లు మరొక ప్రకటన వినిపించింది.

తక్షణమే మరొక సంస్థలో తాను ప్రవేశించినట్లు ఆయన తెల్పలేదు. అది కొంతనయం. కాని, ఈ పంక్తులందే లోపుగా మరొక సంస్థలో ఆయన చేరి నట్లు స్పష్టాంతంవస్తే, ఆశ్చర్యపడము. మనదేశపు రాజకీయాలట్టున్నవి. ఇటువంటి అధోగతికి ముఖ్యకారకులు దేశాన్ని కేంద్రంలో పాలించేవక్షంవారని చెప్పక తప్పదు. వీరి రాజకీయపు రాడికలిజం సెంట్రిజం రూపంలోవున్నా, దాని నిజాయితీని శంకించము; కాని వీరినడవడి

### వారం వార్త

దోషరహితమని చెప్పడానికి వీలులేదు- ముఖ్యంగా పార్టీ మార్పిడిలో. దీనివలన వచ్చిన నష్టాన్ని మైసూర్‌లో చవిజూచి నారు కూడా.

సంజీవరెడ్డి ప్రథమ ప్రకటన సొంత శ్రవణానందం కలిగించిందో, సజ్జనులకు అంత కర్ణకఠోరంగా పరిణమించింది ద్వితీయ ప్రకటన!

తనను రాష్ట్రపతి పదవికి నామినేట్ చేసిన బాధ్యతగలవ్యక్తి తిరిగిపోయి మరొకవిధంగా ప్రవర్తించడం ఎంత ఆశ్చర్యకరంగా, అవసవ్యంగా, అవినీతి కరంగావుండెనో గమనించవలసిందని ఈయన దేశంలోని మారుమూలలలోని జనం వినేటట్లు బిగ్గరగా ప్రచారంచేశాడు. తనపార్టీ, దానికి అనుకూలమైన పక్షాలు ఆ ప్రచారాన్ని హర్షించి, దానిని మరింత ఎక్కువగాచేయడం జరిగింది.

ఇప్పుడీ మహానుభావుడు తనసంస్థ కొక సలహాయిచ్చి అది అమలుజరిగేదో జరగనిదో తెలుసుకోకుండానే, దానిలో నుంచి వైదొలగడం హర్షించదగినదా?

ప్రధానమంత్రి ఆనాటి నడవడి గొప్పదా? సంజీవరెడ్డి యీనాటి నడవడి గొప్పదా? తూకంవేసి చెప్పండి, ఓపిక వున్నవారు!

ఇటువంటి రాజకీయ వాతావరణాన్ని అధిగమించి దేశం ఇక ముందుకుపోలేదా? నడవడికై ఆందోళన చేయరాదా? అది కావలసినవారు రాజకీయాలలో అరుదై పోయినారా?

ప్రజలకు దారిఏది? ఎవరిని ఆదరించ వలె? ఆదరణకు ఏది గీటురాయి?

* * *

ఇంకొక చిత్రం గమనించారా? అది సంజీవచిత్రం అయితే ఇది బ్రహ్మచిత్రం. అతడు సంస్థ గిరిగిరి దాటిపోతావుంటే, ఈతడు తనసంస్థ గిరిగీటు దాటకుండానే తన్నుతాను రెండుభాగాలుగా విభజించు కుని ఎక్కడికెళ్ళింది ప్రస్తుతమో అదే పల్కుతూ ఎక్కడి స్వధర్మాన్ని అక్కడ పాలిస్తూ బండి నడుపుక వస్తున్నాడు. మొన్న నాగార్జునసాగర్‌లో పార్టీ కార్య కర్తలనబడేవారిని సంబోధించి ఆయన ఏమన్నాడో విన్నారా?

"అధికారంలో మనం వున్నాం గనక దానికి అనుబంధమై పోయినాము. దుర దృష్ట వశాత్తూ ఇది జరిగింది. ఇక ఇది అంతంకావలెను." ఎంతటి నిశ్చయం!


పార్టీ ఆర్గనైజేషన్ వరడ్‌బండైవుండి దీక్షతో పనిజేసేవారు దానిలో నిండిపో వలెను. పరిపాలన ఏవిధంగా వుండ వలెనో అది సూచిస్తూ వుండవలెను. పరి పాలనా యంత్రాంగానికి పార్టీ సాయపడు తుంది. మంచి పనులన్నిటిలో కలిసి వస్తుంది. కాని ఆశయాలు నెరవేరని పరిస్థితిలో పార్టీ ప్రభుత్వంపై గట్టి ఒత్తిడి తేవలెను. ఇటువంటి ఒత్తిడిని పార్టీ వర్కర్లు తేవలెనుగాని స్వలాభంకోసం లేక మరొక అల్పమైన అంశంకోసం వారు తాపత్రయపడరాదు" ప్రభుత్వ చక్రం తిప్పుతూ పార్టీమీద ఇంతటి అభిమానంతో పల్కడం ఎంత గొప్పసంగతి? ఎంతటి ధైర్యం, ఎంతటి సాహసం!

"ఒక హరిజన వసతి గృహంలో కరెంట్ వేయమంటే, ఎలెక్ట్రిసిటీ బోర్డు వారు గిట్టుబాటు కాదన్నారు. ఆ గ్రామ పంచాయతీ కొన్నివందల రూపాయలు ఇవ్వగలిగితే, అది గిట్టుబాటయ్యేది. కాని ఆ విధంగా జరగలేదు. అనేకగ్రామాలలో పంచాయతులు సాయపడలేదు." నిజం, నిజం!

"ప్లానింగ్‌లో సంస్కరణ జరగ వలెను. బలహీనులైన తరగతులవారికి ఎక్కువ సదుపాయం కలగవలెను. ప్రతి అభివృద్ధి కార్యక్రమంలోనూ యిది విదితం కావలెను". భేష్, భేష్!

"షెడ్యూల్డ్ క్లాసులకిచ్చిన స్కాలర్ షిప్పులు పూర్తిగా వినియోగం కాలేదు. పంచాయతీరాజ్య సంస్థలద్వారా స్కాలర్ షిప్పుల కార్యక్రమం అమలుజరిగితే న్యాయంకలగదనేమాటవినిపించింది. అనేక ఫిర్యాదులు వచ్చినవి. ప్రజలకు ప్రాతినిధ్యం వహించవలసిన సంస్థలు ప్రజలకు విశ్వా

—కొరవ 8 వ పేజీలో



ఇటీవలదాకా తాళాలుకూడా వేయకుండా, 80 ఎకరాల కాలేజి ఆవరణకు 50 అడుగుల దూరంలోనే ఖాళీగా పడివున్న ఫుడ్‌కార్పొరేషన్ గోడౌన్లు-గూడూరు పౌరులు ప్రయత్నిస్తే వీటిని తాత్కాలికంగా కాలేజీకి ఇప్పిస్తే పార్టిషన్లు పెట్టుకొని కనీసం ఆరేడు క్లాసులైనా జరుపుకోవచ్చు. ఇంతకాలం పూరిపాకల్లో నడచిన కాలేజీక్లాసులు గోడౌన్లకి తరలింపుకావడమైనా అభివృద్ధేగదా!

# ధర్మ యుద్ధంలో పాల్గొని త్యాగధనులై జీవించే తరుణం వచ్చింది!

యుద్ధం వస్తుందా! వస్తే సిద్ధంగా వున్నట్లు మన ప్రభుత్వం ప్రకటిస్తున్నది. పాకిస్తాన్ చర్యలన్నీ అక్కడికే దారి తీస్తు న్నవి. బాంగ్లాదేశ్ ప్రాంతాన్ని నేలమట్టం చేస్తేతప్ప, అది పరమటి పాక్ నియంత లకు స్వాధీనంకాదు. అప్పుడక్కడ స్మశా నమే మిగిలివుంటుంది. ఈలోగా పరమట ఎన్ని కల్లోలాలో? అందువలన, రెండవ పక్షంగా భారతదేశంపై దండెత్తడమే హాయి! ఆ దండు ఫలితం ఏ మవుతుందో యాహ్యా ఎరగకపోడు. కాని ఎరిగి ఏం చేయగలడు?

ఎన్నికలలో సంపూర్ణంగా విజయం పొందిన ముజీబును ఆదరించి, సమాధాన పడితే పోయేది. అంతలోనే గ్రహాలు చుట్టి నవి. ముజీబును వంచక రావలెననే సంకల్పం కలిగింది. అది సాధ్యం కాలేదు. అంతట యాహ్యా మారణహోమం ఆరం భించాడు. దాని ఫలితాలు తెలిసివచ్చినవి

అందువలన భారతదేశంపై పగ సాధించే వాంఛ మరింత అధికమై వుంటుంది. అది సహజం, అందువలన, అగ్నిపరీక్షకు మళ్ళీ సిద్ధమవుదాం. కాంది శీకులపోషణ, యుద్ధ నిర్వహణ - రెంటికీ ఈసారి నిధులను మనం పోగుచేయక తప్పదు. యువతీయువకులు మైదానంలోకి దూకకతప్పదు. ధర్మయుద్ధంలో పాల్గొని, త్యాగధనులై జీవించే తరుణం మనకు వచ్చింది. దీనికి స్వాగతం పలకండి!

* * *

మునుమేకాక పెద్ద పెద్ద రాజ్యాలు కూడా దిక్కుల్లోపడే సమయంవచ్చింది. అరబ్‌రిపబ్లిక్‌లో సాదత్‌నామా సాధించిన ఘటనల వృత్తాంతాన్ని వినివున్నాము. అదంతా సోవియట్ యూనియన్ హర్షించేది కాకున్నా, ఆ సీమను పాలించేవారు దానినిగూర్చి ఏమీ అభాయిత్వం చేయ లేదు. సాదత్ నామా తమకు కొంతవరకు సంతృప్తిని కలిగించినా అమెరికన్లు దానిని బహిరంగంగా ప్రశంసించ లేదు.

ఈ విధంగా మూడవ ప్రపంచసీమల పట్ల అవలంబించే కూటనీతి (అంతర్జాతీయ రాజనీతిలో) అమెరికా - రష్యాలు నూతన అధ్యాయాన్ని రచించినవి.

మొట్టమొదట తమకేమీ సంబంధం గాని, ఆందోళనగాని లేదని చెప్పి, ఆ తర్వాత వచ్చి సాదత్‌పై రష్యనులు విరుచుకపడితే అది పొసగదు. అందువలన, సామీ వగైరాలను శిక్షించక గౌరవ మిత్తుకుండా, రష్యా అధ్యక్షుడు సంబరాలుగా వచ్చి సాదత్ విందారగించి కెయిరోలో (అరబ్ రిపబ్లిక్ రాజధానిలో) అమెరికన్ ఇంపీరియలిజమును ఖండించాడు. పశ్చిమాసియాలో అశాంతికి అనగా ఇజ్రాయిల్ సీమ ధూర్తవైఖరికి అమెరికాయే కారణ మని విందిచ్చినవారూ, విందు గుడిచిన వారూ ఏకీభవించి బహిరంగంగా ఆ విధం గానే ప్రకటించారు.

ఇందువలన రష్యా - అరబ్ రిపబ్లిక్ బంధాలకు దూరమైపోయినవనే అపోహ తొలగింది!

### లోకవృత్తం

సాదత్ నామాను బంధిస్తే అమెరికాకు సమీపంగా అరబ్ రిపబ్లిక్కును చేర వేయడం అవుతుంది. అందువలన సాదత్ ఆ వైపుకు కారణాంతరాలవలన మొగ్గి కార్యసాధన చేసుకున్నా, దానిని గమనించనట్టుగానే వర్తించి, సాదత్‌తో స్నేహం నిర్విఘ్నంగా కొనసాగుతున్నదని లోకానికి నమ్మబలకడమే ఇప్పట్లో శ్రేయస్కరమని భావించి రష్యన్లు అందుకను గుణంగా నడుచుకుంటున్నారు. ఇది కిష్టమైన రాజనీతికాదని కొందరంటే అందుకు! వివేకం కాదనిమాత్రం ఎవరనగలరు?

పెద్దరాజ్యాలకు వివేకోదయం కల గడం ప్రపంచానికి మేలేగదా!

* * *

—కొరవ 10 వ పేజీలో

## ఇది విన్నారా?

● జనరల్ సుహార్తో (ఇండోనీషియా) యాహ్యాఖాన్ పక్షమైనాడు. పాకిస్తాన్ అంతరంగిక విషయాలు ఇతరుల కక్కర లేదన్నాడు. పాక్ ప్రెసిడెంట్ అధ్వర్యాన పాక్‌సీమఐక్యత స్థిరపడుతుందని ఆయన ఆశించాడు- నమ్ము, నమ్మకపో!

● బాంగ్లాదేశ్ ఉపద్రవంవచ్చిపడింది గనక సరిహద్దున గందరగోళం వచ్చి పడింది గనక ఈ తరుణంలో రాష్ట్రానికి అధికస్వపరిపాలన విషయం తానెత్తదల చుకోలేదని కరుణానిధి ప్రకటించాడు. కరుణించావయ్యా!

● రావణకావ్యంపై నిషేధాన్ని తొల గించినట్టే, దేవళ్ళను హేళనచేసే ఊరే గింపులను తమిళనాడు ప్రభుత్వం నిషే ధించింది. సమదృష్టి.

## గమనించారా?

● టర్కీలో పెద్ద భూకంపంవచ్చింది. భూకంపాలను ముందుగా తెలుసుకునే విధానం సరిగా అమరలేదు; త్వరలో అది కుదిరితే, జననష్ట బాధలవరకు తగ్గించ వచ్చును.

● మార్స్ గ్రహంమీదకు, కొన్నివిధాల తర్వాత, రష్యన్ సైంటిస్టులు ఒక అంతర్గ్రహ కూటమిని రవాణా చేశారు. ఈ కూటమి ఒక స్థావరం వంటిది. మార్స్ నుంచి సూర్యగోళం సంగతులనేకం ఈ స్థావరంద్వారా తెలుసుకోగలరు. వీరంతా కలిసి త్రిశంకుస్వర్గాన్ని నిజం చేస్తున్నారా?

● మూడు ఉపఎన్నికలలో త్రి బిష్ లేబర్‌పార్టీ గెల్చింది. సాధారణంగా ప్రతి పక్షమే ఉపఎన్నికలలో నెగ్గుతుంది.

● రిటైర్‌మెంట్ వయసును పెంచ మంటారు సాధారణంగా. కాని ఫ్రెంచి పత్రికల వర్కర్లు దానిని 65 నుంచి 60 చేయమంటున్నారు. చేయకుంటే సమ్మె చేశారు. ఫ్రాన్సులో పత్రికలులేవు. ఈ పంక్తులందేలోపల సమ్మె అంతం కావచ్చును.

● చిలె (Chile)సీమకు అమెరికన్లు మిలిటరీ విమానాలను అమ్ముతున్నారు. మార్క్సిస్టు (స్వతంత్ర ప్రతిపత్తిగల మార్క్సిస్ట్) అలెండే ఆ సీమకు అధిపతి. అటువంటి సీమకు యుద్ధసామగ్రిని అమెరికా ఎందుకమ్మడం? అంటే, ఫ్రాన్సు ఇస్తుంది అమెరికా ఇవ్వకపోతే!

● చైనా-పాకిస్తాన్ బాంధవ్యాలు కలిసి ఇరవై ఏండ్లయింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని పీకింగ్‌లో విందు జరిగింది. అందులో ఒకర్నొకరు పొగుడుకున్నారుగాని ఇండియాను సూచించలేదని వృత్తాంతం.

# పెండ్లిండ్లు

కావట్టి పాఠకులు ముగ్గురు మా 'పెండ్లిండ్ల' వ్రాతలమీద దండెత్తారు (గత వారం 'జనవాణి' చూడండి). వ్రాతలు శ్రుతాజు పొగడ్తలుగా వుంటున్నవని వారి అభిప్రాయం. వధూవరులను గూర్చి కాకుండా, వారి తల్లిదండ్రులను పొగడడం ఏమిటి అని వారి ప్రశ్న. తమ వ్రాతలపై పాఠకుల అభిప్రాయం తెలిసికోవడంకంటే, రచయితకు సంతోషకరమైన విషయం ఇంకొకటుండదు. అందువల్లే పై పాఠకుల విమర్శలకు స్వాగతం చెప్తున్నాము.

పాఠకుల అభిరుచులు మారాయి. ఒకటి రెండు దశాబ్దాలక్రితం అభిరుచులకు, ఇప్పటికీ చాల తేడావుంది. ఈ రచయిత పత్రికా వ్యాసంగంలో ప్రవేశించిన కొత్తల్లో పాఠకుల అభిప్రాయాలకీ, అభిరుచులకీ; ఇప్పటికీ ఎంతో భేదం. అప్పుడు పెండ్లిండ్ల పురాణాన్ని విరగబడిచదివేవారు. ఆ శీర్షిక ముందు ఇంకేదీ రుచించేదికాదు. తర్వాత ఆ శీర్షికకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని, ఆ కారణంగా పత్రిక చప్పగా వుంటున్నదని ఈ రచయితతో కొందరు పాఠకులనడం జ్ఞాపకంవుంది. ఇటీవల పెండ్లిండ్లను గూర్చి ఇవ్వడం ఏమిటి అనే విమర్శలు వినడం జరుగుతున్నది. అందువల్లే అప్పటి విలువలకు, ఇప్పటి విలువలకు సంబంధమే లేదనుకోవలసి వస్తున్నది. ఒక్క పెండ్లిండ్లకు సంబంధించేకాదు, ప్రతి శీర్షికకు సంబంధించీ, ప్రతివార్తకు సంబంధించీ, ప్రతి వ్యాఖ్యకు సంబంధించీ ఇదే పరిస్థితి. దీన్ని గుర్తించకుండ వుండలేము.

కాని పెండ్లిండ్ల శీర్షిక పొగడ్తలకోసం మాత్రంకాదు. దానికి వార్తా ప్రాధాన్యత వుంది. ఆ విషయం బయటివుండే పాఠకులకు తెలియదు; మాకుతెలుసు. ఎందువల్లనంటే, నెల్లూరీయుడు దేశంలో ఎక్కడున్నా, ప్రపంచంలో ఏ దేశంలోవున్నా 'జమీన్ రైతు' తెప్పించుకుంటున్నాడు; శ్రద్ధగా చదువుతున్నాడు. దేశంలో ఏ విశ్వవిద్యాలయంలో చదువుతున్నా, నెల్లూరు విద్యార్థి జమీన్ రైతు పాఠకుడుగా వుంటున్నాడు; ఎక్కడ వుద్యోగం చేస్తున్నా జమీన్ రైతు చందాదారుగా వున్నాడు. అట్లనే బ్రిటన్, అమెరికా, జర్మనీ, జపాన్ వగైరా అనేక దేశాలలోవున్న నెల్లూరీయులు జమీన్‌రైతు తెప్పించుకుంటున్నారు. వీరంతా ప్రపంచవార్తలకోసమో, దేశరాజకీయాలకోసమో తెప్పించుకోవడం లేదు. వాటికి మంచి దినపత్రికలున్నాయి. నెల్లూరు వార్తలకోసమే వారు తెప్పించుకుంటున్నారు. నెల్లూరుకు వందలు వేల మైళ్ళ దూరానవున్నా, జమీన్‌రైతు వల్ల నెల్లూరులో వున్నట్లే వుందని ఎంతోమంది పాఠకులు వ్రాస్తుంటారు, చెప్తుంటారు. అటువంటి పాఠకులను దృష్టిలో పెట్టుకునే 'క్యాటలాగు'లాగావున్నా, పెండ్లిండ్ల శీర్షికనుకూడా వదలిపెట్టకుండా నిర్వహిస్తుంటాము.

ఇక శ్రుతాజు పొగడ్తలంటారా? నిజమే, వెగటుగానే తోచవచ్చు. కాని ఇప్పటి పెండ్లిండ్లలో ఇంక వ్రాసేదేముంది? అమ్మాయి చదువుసంధ్యలేని పంతఅయితే, ఆవిషయం వ్రాయమంటారా? అమ్మాయి అందంగా లేకుంటే, ఆవిషయం వ్రాయమంటారా? వేలు, లక్షలు కట్నాలు గుంజితే, దాన్ని బహిర్గతంచేయమంటారా? శుభమస్తు అంటూ పెండ్లిచేస్తుంటే, అపశకునాలుపలకమంటారా? కొత్తదంపతుల మనసుల్లో కొరతలు కల్గించమంటారా? తల్లిదండ్రులనుగూర్చి రెండు మంచిమాటలు వ్రాయడమంటే– పరిచయమున్న వ్యక్తి, మంచివాడనే అభిప్రాయమున్న వ్యక్తిని గూర్చి రెండు మంచిమాటలు వ్రాయడానికి అది సందర్భం కాదంటారా? అది తప్పంటారా?

కావట్టి పాఠకులు మా వుద్దేశ్యాలను సహృదయంతో అర్థంచేసుకోగలరనుకుంటాము.

### ధేనువకొండ వివాహాలు

జమీన్‌రైతోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకుడు, ఆచార్య రంగా రాజకీయ బంధుకోటిలో ముఖ్యుడు, మాజీ శాసనసభ్యుడు, సిన్సియారిటీకి మారుపేరనదగిన మా శ్రేయోభిలాషి శ్రీ నాగినేని వెంకయ్యగారు తనకుమారుడు రామకృష్ణ ప్రసాదుకు, శ్రీ గోరంట్ల బావయ్యపుత్రిక సౌభాగ్యవతి భారతితో; తనకుమార్తె స్వర్ణలతాదేవికి, ఉదయగిరితాలూకా కోవివారిపాలెం శ్రీ కోవి వెంకయ్యగారి కుమారుడు శ్రీ వివేకానంద ఎం ఎస్‌సి., తోను–21 తేది ధేనువకొండలో వివాహాలు జరిపారు.

ఈసందర్భంలో శ్రీ వెంకయ్యగారు– "...నా చిరకాల సన్నిహితమైన జమీన్ రైతుకు రూ 100 లు కానుకగా పంపుతున్నాను. స్వీకరించ కోరెదను." అంటూ పంపారు వారికి మా ధన్యవాదములు.

### రామయ్యచౌదరి కుమార్తె

పెద్దవాళ్లి ఓడించడంద్వారా పెద్దగా పేరు కువచ్చిన ఉదయగిరి మాజీ ఎం.ఎల్.ఎ., ఆనం సంజీవరెడ్డిమీద అలుకతో నీలం సంజీవరెడ్డిగారితోచేరి రాజకీయ గోదావరి ఈదదలచిన నిష్కపటవు మిత్రుడు శ్రీ కోవి రామయ్యచౌదరి కుమార్తె సౌభాగ్యవతి వెంకమ్మకు; వెదుసుపల్లి, శ్రీ రాటకొండ సాల్వపతి నాయుడు కుమారుడు ఆయుష్మంతుడు వేణుగోపాల్‌కు 9 తేది కోవివారిపల్లెలో కళ్యాణంజరిగింది.

### సింగమనేనిపల్లి పెండ్లి

కందుకూరు తాలూకా సింగమనేనిపల్లి వాసి; ఆచార్య రంగా అభిమానం చెందు రామానాయుడుగారి శిష్యరికం కలిగి భూమితనఖా బ్యాంకు ఉపాధ్యక్షతకు మించి ఎదగలేకుండావున్న శ్రీ గరికపాటి సీతారామయ్య తన కుమారుడు చిరంజీవి రామచంద్ర శివప్రసాద్‌కు; శ్రీ అతోట అజయ్యగారి కుమార్తె సౌభాగ్యవతి అన్నపూర్ణతో 12 తేది తన స్వగృహంలో వివాహం జరిపారు.

### డాక్టరు కుమార్తె

దంతవైద్యుడు; ప్రపంచం తల్లక్రిందులైనా హాజరుకావడం తప్పిపోని రోటేరియను, మితభాషి, పద్ధతిగల డాక్టరు కె. మోహనరావుగారి తనయ సౌభాగ్యవతి చిత్రలేఖకు; కాకినాడ రిటైర్డ్ తాసిల్దారు శ్రీ రాయి బ్రహ్మాదరావు కుమారుడు శ్రీ హరగోపాల్ బి. కాం.కు 15 తేది టవున్ హాలులో వివాహం జరిగింది. మిట్టమధ్యాహ్నమైనా, ఎండ నిప్పులు చెరగుతుండినా ఆహూతముఖ్యులతో హాలు నిండిపోయింది.



శ్రీ రాయి హరగోపాల్ బి. కాం;
డాక్టరు కె. మోహనరావుగారి కుమార్తె చిత్రలేఖ.

### సులోచన - శేషారెడ్డి

వల్లాయపాళెం శ్రీ మేడా గోపాలరెడ్డి కుమార్తె, శ్రీ ఎస్. జనార్దనరెడ్డి మరదలు సౌభాగ్యవతి సులోచనకు; నాగార్జున సాగర్‌లో జూనియర్ ఇంజనీరుగా పని చేస్తున్న వెంకటగిరి తాలూకా పెట్లూరు వాసి, శ్రీ బత్తినపట్ల మల్లారెడ్డి కుమారుడు శ్రీ శేషారెడ్డికి 26 తేది సాయంత్రం నెల్లూరు అన్నదాన సమాజంలో పరిణయం జరిగింది. మంత్రి సంజీవరెడ్డి – చేర్మన్ గోపాలకృష్ణారెడ్డి – ఎం. ఎల్. సి. రామచంద్రారెడ్డి, ఎం.ఎల్.ఎ రామచంద్రారెడ్డి వగైరా జనార్దనరెడ్డి రాజకీయ, విద్యా సాంఘిక రంగమిత్రులే కాకుండా, వెంకటగిరి రాజకీయాలలోని 'వారింగ్‌గ్రూపులు' రెండూ హాజరయ్యాయి.

### కాటంరెడ్డివారి కళ్యాణం

నేను వూహిస్తాను – [illegible] తాలూకా కోవూరు సమితిపతి శ్రీ కాటంరెడ్డి వెంకటరామరెడ్డి గారింట్లో రాజకీయాలు ఆరోగ్యకరమైన సహజీవనం చేస్తున్నాయేమోనని. వెంకటరామరెడ్డి కొత్త కాంగ్రెస్ మతావలంబి; పడుగుపాడు సర్‌పంచ్, వెంకటరామరెడ్డిగారి అన్న శ్రీ రామచంద్రారెడ్డి అభిప్రాయాలలో భిన్నమార్గావలంబి. సౌమ్యులు, సంస్కారులైన ఈ ఇరువురి సోదరుడు శ్రీ చంద్రశేఖరరెడ్డికి, ఒంటరి-శ్రీ వేమూరు జనార్దనరెడ్డి కుమార్తె సౌభాగ్యవతి సురేఖకు 26 తేది రాత్రి శ్రీ కస్తూరిదేవి విద్యాలయంలో వివాహ మహోత్సవం జరిగింది. జనసందోహంలో మంత్రిగారి పెళ్లికి కుడి ఎడమగా తలతూగింది ఈ పెండ్లి. వివాహాన్ని ఆరుబయట జరిపివుంటే బాగుండేదనిపించింది. 27 తేది పడుగుపాడు పలావ్‌విందుకే రెండువేలమంది వచ్చినట్లున్నారు



కాటంరెడ్డి చంద్రశేఖరరెడ్డి – సురేఖ

### కట్నంలేని పెండ్లి

నోరుకలిగిన (శాసనసభలోనే సుమండి) నెల్లూరు శాసనసభ్యుడు శ్రీ అన్నదాత మాధవరావు తమ్ముడు; అంటే, ప్రస్తుతం శ్రీ ఏనుగ పట్టాభిరామరెడ్డి నిర్వహణలోవున్న హరిజన హాస్టలు స్థాపకుడు స్వర్గీయ అన్నదాత ఆదినారాయణయ్యగారి పుత్రుడు డాక్టరు ఎ. వి. సుబ్రహ్మణ్యం ఎం.బి.,బి.ఎస్.కు; న్యాయవాది, సాహిత్యప్రియుడు శ్రీ మద్దాళి మల్లికార్జునరావుగారి కుమార్తె, ఎం.బి.,బి.ఎస్. డిగ్రీపొందనున్న సౌభాగ్యవతి ఉమాసుందరికి–26తేదివధువు ఇంట పాణిగ్రహణం జరిగింది. ఎం. ఎల్. ఎ. గారికి సంబంధించిన పెండ్లి కాబట్టి, సంజీవరెడ్డిగారివంటి పదవులేకాకుండా, కలెక్టరు వంటి అధికార్లు; అసంఖ్యాకంగా మిత్రబృందమూ హాజరయ్యారు. చాలా మంది నమ్మకపోవచ్చుగానీ వరుడు విద్యాధికుడైవుండికూడా కట్నం కోరలేదుగాన ప్రత్యేకించి ప్రశంసాపాత్రుడు. ఈరోజుల్లో కట్నంలేనిపెళ్లి అరుదు. అరుదుగాబట్టి విలువైందికూడా.

### జంట పెళ్లిళ్లు

క్రిమినల్ లాయరుగా అనతికాలంలోనే పైకివచ్చిన శ్రీ ఎస్. రంగనాథం సోదరులు - శ్రీ సుధాకర్ (ట్యూటర్- వి. ఆర్. కాలేజి), శ్రీ వెంకటకృష్ణ (స్టేట్‌బ్యాంకి) గారలకు– వరుసగా మల్లూరు శ్రీ వి. బలరామయ్య పుత్రిక సౌభాగ్యవతి లక్ష్మికి సింగరాయకొండ శ్రీ ఎస్. బాలయ్య కుమార్తె సౌభాగ్యవతి రూప్వతో– 26తేది అన్నదానసమాజంలో వివాహాలు జరిగాయి. బంధుమిత్రులు బాగవచ్చారు.

### రాజేశ్వరి - బాలకృష్ణ

న్యాయవాదిగా స్థిరమైన పునాదికలిగి వుండడమేకాక, రైతుగా – పార్శ్వకాయికుడుగాకూడా, బహుళ పరిచయస్తుడైన శ్రీ పెగ్గరాజు వెంకటనరసింహారావు కుమార్తె సౌభాగ్యవతి రాజేశ్వరికి; మచిలీపట్నం న్యాయవాది శ్రీ ముదునూరు శేషగిరిరావు కుమారుడు, బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌సైన్స్‌లో పనిచేస్తున్న శ్రీ బాలకృష్ణ బి. ఇ., ఎం. ఎస్‌సి.కి 28 తేది అన్నదాన సమాజంలో వివాహం జరిగింది. నెల్లూరుకు చుట్టమైపోయిన హైకోర్టు న్యాయవాది శ్రీ ఆమంచర్ల గంగాధరరావు ప్రభృతులు ప్రతి ఆహూతుణ్ణి నోటితో–చేతితోకూడా పలుకరించారు.

పెండ్లికి ఎన్ని తరగతుల, ఎన్నిరంగాల ఆహూతులొచ్చారనుకున్నారు! భోజనాల పెత్తనమంతా నెల్లూరు రైతులదిగా వున్నట్లుంది. బ్రాహ్మణపెళ్ళే అయినా, రైతుపెళ్లిగా తోచిందినాకు.

### గోపాలకృష్ణారెడ్డి - అనూరాధ

ఆత్మకూరు సమితి మాజీ రాజా శ్రీ వంగూరు వెంకటసుబ్బారెడ్డి కుమారుడు, ప్రస్తుతరాజా శ్రీ సి. వి. కృష్ణారెడ్డి బావమరది, చదువులో ప్రతిభావంతుడైన విద్యార్థి అనిపించుకున్న శ్రీ గోపాలకృష్ణారెడ్డి ఎం. ఎస్‌సి., గుండాలమ్మపాళెం–శ్రీ సిద్దారెడ్డి వెంకటవరదారెడ్డి తనయ సౌభాగ్యవతి అనూరాధకు 27 తేది తిరుదానూరులో వివాహం జరిగింది.

---

### జమీన్ రైతు

| | |
|---|---|
| సంవత్సరం చందా | రు. 15-00 |
| 6 మాసములకు | రు. 8-00 |
| విడిప్రతి | రు. 0-30 |


## నిమిషాలలో మాయమయిన జలుబు!



## అమృతాంజనం




జలుబు, తలనొప్పి, బెణుకులు, కండరాలనొప్పి—వీటివల్ల వచ్చిన బాధలను చల్లగా తగ్గించుకోండి. బాధగా వున్న చోటుమీద అమృతాంజనం రాయండి. వెంటనే సుఖం ఇస్తుంది. 78 సంవత్సరాలపైగా ఇంటింట దీపమై వెలుగుతోంది అమృతాంజనం! ఎప్పుడూ ఒక సీసా దగ్గర వుంచుకోండి. అమృతాంజనం ఆదాచేసే పెద్దసీసాలలోనూ, చిన్న డబ్బాలలోనూకూడా దొరుకుతోంది.

అమృతాంజనం 10 ఔషధాలు కలిసినది.
నొప్పులను, జలుబులను చప్పున, చల్లగా తగ్గిస్తుంది.

అమృతాంజన్ లిమిటెడ్ AM-1989

# నెల్లూరు కబుర్లు

విహార్యకుడు

## విద్యుచ్ఛక్తి రేట్ల పెంపకం వాయిదా

విద్యుచ్ఛక్తి రేట్ల పెంపకాన్ని జూన్ 1 తేది నుండి అమలుజరపకుండా వాయిదావేస్తున్నామని; ఈ పెంపకసమస్యనుగూర్చి ముఖ్యమంత్రి పాల్గొనే సమావేశంలో చర్చించే గలమని విద్యుచ్ఛక్తి మంత్రి శ్రీ బి. కృష్ణమూర్తి నాయుడు ప్రకటించారు. పెంపకానికి వ్యతిరేకంగా రైతులనుండి ఆందోళన రావడం, నెల్లూరు జిల్లాపరిషత్తు ఏకగ్రీవంగా పెంచవద్దని తీర్మానించడం— పునఃపరిశీలనకు ప్రభుత్వాన్ని లొంగదీసిన కారణాలుగా కనబడతాయి. రైతులు, ప్రజాహిత సేవాసంస్థలు, రాజకీయపార్టీలనుండి ఇంకాస్త గట్టి ఆందోళనవస్తే, విద్యుచ్ఛక్తి రేట్లు పెరగకుండాపోయే అవకాశముంది.

రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి రేట్ల పెంపకాన్ని నెల్లూరు జి. ప. ఒక్కటే వ్యతిరేకించి నట్లుంది. అన్నైనీ జి. ప. లుండగా, మన జి. ప. ప్రధానసమస్యను చేపట్టటం, ప్రభుత్వాన్ని పునఃపరిశీలనకు దించడం ప్రశంసనీయం. అందుకే చేర్మెన్ గోపాలకృష్ణారెడ్డిని అభినందిస్తున్నాము.

రేట్ల పెంపకాన్ని ప్రతిఘటిస్తూ ఆందోళన చేయవలసిన ఒక రైతునంఘమిత్రుడు—పాపం, పెంచకుంటే ప్రభుత్వానికి డబ్బు ఎక్కడనుండి వస్తుంది అని తన దయార్ద్ర హృదయాన్ని చాటుతూ, గమ్ముగుండి పోయాడు. ఇప్పుడు రేట్ల పెంపకాన్ని ప్రభుత్వం విరమించుకోడమే జరిగితే, ఈమిత్రుడు పెంచాలి అని నినాదమివ్వకుంటే అంతవరకన్నా సంతోషిస్తాము! ఈయన విద్యుచ్ఛక్తి బిల్లుల భారం తెలియనివ్యక్తి కాదు. రైతుల స్థితిగతులు సరిగా అవగాహన చేసుకోలేక పోయాడేమో ననుకోవాలి. అంతేగదా!

## కాటన్ దినోత్సవం వాయిదాపడింది!

6 తేది జరుగవలసిన సి ఐరెండ్ కాటన్ దినోత్సవం వాయిదాపడింది. అంటే మంత్రులు కాకాని వెంకటరత్నం, అనగాని భగవంతరావుగారలు రావడంలేదన్న మాట. దినుకు మబ్బుగావుండడం; ఎన్. జీ. ఓ. ల సమ్మె—ఈ వాయిదాకు కారణమట బహుశా రివిన్యూమంత్రిపట్ల కడప ఎన్. జి. ఓ. ల అనభ్య ప్రవర్తనతర్వాత, సమ్మెసమయంలో మంత్రులు తిరగడం మంచిది కాదనుకున్నారో ఏమో మరి!

## మరణాలు

ఉప్పు సత్యాగ్రహం మొదలు ప్రతి ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షననుభవించిన స్వాతంత్ర్యయోధుడు, దేశభక్తుడు; అచ్చమైన కాంగ్రెసువాది, ఖద్దరుధారి; పేదవాడైనా వ్యక్తిత్వాన్ని కోల్పోని సూళ్లూరుపేటవాసి శ్రీ యాగంటి రామలింగం 31 తేది దివంగతుడైనాడు. రామలింగం చాలకాలంగా ఉబ్బసవువ్యాధితో చిత్రహింస ననుభవిస్తూ శాశ్వతశాంతిని పొందాడు. రామలింగంగారికి చిత్తశుద్ధిక వుంది. ఆ నిష్కళంక దేశభక్తునికివే మా జోహారులు.

. . .

వరికోళల వంతీతులు కీ. శే. దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారి ధర్మపత్ని శ్రీమతి వరదాయమ్మ ఇటీవల హఠాత్తుగా కాలధర్మం చెందింది. భూవనతిలో జిల్లాలో మొదటగావచ్చే పదికుటుంబాల్లో వీరిది ఒకటంటారు. అంత సంపన్న కుటుంబం. వీరికి సంతానంలేదు. వీరి ఆస్తికి వారసులు— పి. సి. తమ్ముడు శ్రీ ఆనం శేషారెడ్డిగారే. వెంకటకృష్ణారెడ్డి, వరదాయమ్మ గారల డెత్‌డ్యూటీయేకొన్నిలక్షలవుతుంది. శేషారెడ్డిగారు దేవరపల్లివారి స్మృతి చిహ్నంగా ఒక సాహిత్య కార్యక్రమాన్ని శాశ్వతీకరించడం; కనీసం వారు సేకరించి పోయిన గ్రంథాలయం సార్థకపరచడం సముచితంగా వుంటుంది.

. . .

గూడూరు మైకావ్యాపారి; పశువుల ఆహారానికి సంబంధించిన పయొనీర్ ఇండస్ట్రీసును నెలకొల్పి నడుపుతున్న శ్రీ పెళ్లకూరు వెంకటకృష్ణారెడ్డిగారు గుండెపోటుతో 1 తేది మరణించారు. వారి వయస్సు 54 సంవత్సరాలు.



## కందుకూరు కాలేజి ప్రిన్సిపాల్ కృష్ణస్వామి ఆకస్మిక మరణం!

కందుకూరు, తిక్కవరపు రామరెడ్డి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా అందరికి ప్రేమపాత్రుడైన శ్రీ టి. కె. కృష్ణస్వామి గారు సముద్రస్నానం చేయాలని మొన్న 1 తేది ఉదయం అల్లుళ్లతోను, బిడ్డలతోను, స్నేహితుడైన డాక్టర్ కోటారెడ్డి గారితోను రామాయపట్నం రేవుకువెళ్లి, స్నానంచేస్తూ ఆకస్మాత్తుగా గుండె ఆగిపోయి ఆ నీళ్ళల్లోనే మరణించారు. తిరుగు అలలోనే కృష్ణస్వామిగారి కళేబరం ఒడ్డుకు చేరుకున్నది.

బంధువుల రాక అనంతరం 2 తేది వుదయం కందుకూరు ప్రముఖులు, ప్రజలు అధ్యాపకులు, విద్యార్థులు ప్రిన్సిపాల్‌గారి మృతదేహాన్ని ఘనంగా హంసవాహనంపై వూరేగింపుజరిపి కళాశాల అధ్యాపకుల 'కృష్ణనగర్ కాలనీ' లోవారి స్వస్థలంలోనే దహనసంస్కారాలు జరిపించారు. కందుకూరుకాలేజిని ఎంతగానో ప్రేమించి చాలించి, పోషించి తీర్చిదిద్దారు, వున్నంతలోనే ఎన్నో వసతులను సమకూర్చి అందరి మన్ననలనూపొంది అందరి ప్రేమాభిమానాలకు పాత్రమైనారు. కడకు ఆ కందుకూరులోనే తనువు చాలించారు. సంతాపసూచకంగా ఆరోజు పట్టణంలోని అంగళ్లన్నీ మూసేసారు

## కాలేజి ప్రాక్టికల్స్

పి. యు. సి 13 తేది, బి. ఎస్‌సి. 14 తేది ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని వి. ఆర్. కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ ఆర్. సుబ్బారెడ్డిగారు తెల్పుతున్నారు.

అన్నికాలేజీలలోకూడా ఆ తేదీలలోనే జరిగేట్టుంది. ఇంతకాలం వాయిదాపడిన పరీక్షలను జరుపుతున్నపుడు, యూనివర్సిటీవారు పత్రికా ప్రకటనద్వారా తేదీలు తెల్పటంలేదా? ఎంత ఇబ్బందరండీ!


## ఎస్. ఐ. సీతారామరెడ్డి సహాయనిధి

డ్యూటీలో దుర్మరణంపాలైన ట్రాఫిక్ ఎస్. ఐ. సీతారామరెడ్డి కుటుంబం నిస్సహాయంగా వుందట. భార్య, ఐదుగురు చిన్న పిల్లలు. వారికుటుంబానికి ఎదైనా సహాయం చేయడం ధర్మమని భావించి—ఆర్. ఎల్ రెడ్డిగారు కన్వీనరుగా మొన్న 2తేది ఒక సమావేశం జరిపించబడింది. మంత్రి సంజీవరెడ్డి, జి. ప. చేర్మెన్ గోపాలకృష్ణారెడ్డి, ఎం.ఎల్.సి గునుపాటి రామచంద్రారెడ్డి, ఎస్. పి. నగైరా అధికార అనధికార ముఖ్యులు హాజరైనారు. అప్పటికప్పుడే గునుపాటి 2 వేలు, ఆల్తూరు రామిరెడ్డి వెయ్యి, ఆర్. ఎల్ రెడ్డి ట్రస్టు వెయ్యి, బస్‌యజమానులపక్షంగా కె.వి.ఆర్ 3200, ఇంకాకొంతమంది వేసిన విరాళాలు 7750 రూపాయలు అయ్యాయి వాగ్దానం చేసినవారు ఇంకావున్నారు. 20 వేల రూపాయలైనా సేకరించి ఇవ్వాలనేది సంకల్పమట. ఈ వుపకార కార్యానికి శక్త్యానుసారం ప్రతిఒక్కరూ సాయపడడం వుచితంగా వుంటుంది.

## రామచంద్రారెడ్డి ప్రకటన

సోమశిలకు సంబంధించి గూడూరు ఎం. ఎల్. ఎ. శ్రీ వేమారెడ్డిగారు వంపిన రెండు పేజీల ప్రకటన చదివాము, మళ్ళీ చదివాము, మూడోసారికూడా చదివాము అయన చెప్పదలచుకున్నదేమిటో, చెప్పిందేమిటో మాకు అర్థంకాలేదు. సోమశిల గూడూరుకు రాలేదంటున్న ఎన్. సి. చి అవకాశవాదము, బాధ్యతారాహిత్యము ఇంకా ఏమేమిటో అని అంటున్న రామచంద్రారెడ్డిగారు, అయిరున అందరూ విస్తృత సోమశిలను కోరారుకాగ; నెల్లూరు, కోవూరు తాలూకాలకు పరిమితం చేయమని కోరలేదు అంటున్నారు.

వ్యక్తి, వర్గ, పార్టీ సంఘర్షణల్లో సోమశిలను నలిపివేయవద్దని అందరినీ కోరుతున్నాము.



వరుడు : కురుగొండ శ్రీ వెంబోటి రంగారెడ్డి కుమారుడు శ్రీ గోపాలరెడ్డి బి. ఎస్‌సి., బి. ఇ., ఎం. ఎస్. (కాలిఫోర్నియా—యు ఎస్. ఎ.);
వధువు : చిల్లకూరు శ్రీ యాదనపర్తి రాఘవరెడ్డి కుమార్తె సౌభాగ్యవతి తులసి ఎం. ఎ.
వీరి వివాహం 28 తేది చిల్లకూరులో జరిగింది. అబ్బాయి శ్రీ గోపాలరెడ్డి షికాగో వద్ద డికేటర్ అనేచోట కేబిల్స్ కంపెనిలో ఇంజనీరుగా పనిచేస్తున్నారు; సంవత్సరానికి 10 వేల డాలర్ల వేతనం; అమ్మాయి తులసి హోంసైన్సులో రిసర్చ్ చేస్తూ, విరమించుకొని భర్తతోబాటు అమెరికా వెలో అంటున్నది.

## మూడేళ్ల శిక్ష

అన్నంతా తనకు వ్రాసివ్వలేదనే ఆక్రోశంతో తన అక్క సన్నబోయిన సుబ్బరత్నమ్మను పొడిచిచంప ప్రయత్నించారని, నెల్లూరు బృందావనంవాసి సాగల రాధాకృష్ణమూర్తిమీద మోపబడిననేరాన్ని (ఇం. పి. కో. 326), జిల్లా అడిషనల్ సెషన్స్‌జడ్జి శ్రీ డి. ఎల్. ఎన్. రాజుగారు విచారించి, ముద్దాయికి 3 ఏళ్ల శిక్ష, రూ 50 లు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఈ కేసులో ప్రాసిక్యూషనుకు అ. ప. ప్రా. శ్రీ సి. రామకృష్ణ, ముద్దాయికి శ్రీ వి. అనంతరామయ్య వాదించారు.

## ఎన్. జి. వో. లు

పాపం, ఎ. జి వో లు అవస్థ వర్ణనాతీతంగావుంది, ముందుకుపోలేరు, వెనక్కు రాలేరు. ఈ వారంలో పికెటింగ్ను వుధృతంచేశారు, కలెక్టరాఫీసు ముందు నినాదాలు అధ్యదం విస్తృతం చేశారు. పోలీసు గత రెండుకోజులుగా వందలాదిమందిని లాకప్‌లోకి తీసుకొని సాయంత్రానికి మళ్ళీ విడుదల చేయడం జరిగింది. కావలి, గూడూరు, కోవూరు వగైరా ప్రాంతాల్లోకూడా ఇదే పరిస్థితి. నిన్న, నేడు పికెటింగ్ లేదు.

## నెల్లూరు బజారు

| | | |
|---|---|---|
| మొలగొలుకులు | పుట్టి 1-కి | 610-00 |
| జి. ఇ. బి. | ,, | 620-00 |
| సజ్జలు (హైబ్రిడ్) | ,, | 690-00 |
| ,, (దేశి) | ,, | 650-00 |
| జొన్నలు (దేశి) | ,, | 700-00 |
| ,, (హైబ్రిడ్) | | 560-00 |
| రాగులు | ,, | 600-00 |
| ఉలవలు | తూము 1 కి | 46-00 |
| పిల్లిపెసలు | ,, | 56-00 |
| పచ్చపెసలు | ,, | 57-00 |
| మినుములు | ,, | 68-00 |
| మిరపకాయలు | మణుగు | 40-00 |
| వేరుశనగకాయలు | 10 కె జి. | 12 50 |

## ఉత్తరక్రియలు •••

30-5-71 తేది ఆదివారం రాత్రి 9-30 గంటలకు

**నా భార్య శ్రీమతి చెన్నంశెట్టి శేషమ్మ**

స్వర్గస్తురాలైనది.

9-6-71 తేది బుధవారం ఉదయం నెల్లూరు నవాబుపేట, గాండ్ల వీధిలో నా స్వగృహమున ఉత్తరక్రియలు జరిపించబడునని బంధు మిత్రులకు తెలియజేయుచున్నాను.

నెల్లూరు,
3-6-71.

ఇట్లు,
చెన్నంశెట్టి వెంకయ్య.


## THE NELLORE TYRE DEALERS ASSOCIATION
**NELLORE.**

DISTRIBUTION OF TRUCK/BUS TYRES MONTH BY MONTH

We give below for the information of the Bus and Lorry Operators in Nellore District the following:—

| Size | Month | Tyres received from Tyre Companies & Distributed | Tyres Registered for supply | Balance to be supplied |
|---|---|---|---|---|
| 8.25×20 | January 1971 | 89 Nos. | 55 Nos. | — |
| | February ,, | 31 ,, | 71 ,, | 40 Nos. |
| | March ,, | 104 ,, | 113 ,, | 9 ,, |
| | April ,, | 51 ,, | 88 ,, | 37 ,, |
| | May ,, | 66 ,, | 46 ,, | — |
| 9.00×20 | January ,, | 84 ,, | 147 ,, | 63 ,, |
| | February ,, | 57 ,, | 75 ,, | 18 ,, |
| | March ,, | 125 ,, | 181 ,, | 56 ,, |
| | April ,, | 65 ,, | 86 ,, | 21 ,, |
| | May ,, | 108 ,, | 138 ,, | 30 ,, |
| 10.00×20 | January ,, | 10 ,, | 12 ,, | 2 ,, |
| | February ,, | 10 ,, | 12 ,, | 2 ,, |
| | March ,, | 2 ,, | 2 ,, | — |
| | April ,, | 6 ,, | 6 ,, | — |
| | May ,, | 14 ,, | 8 ,, | — |
| | TOTAL | 822 Nos. | 1040 Nos. | 278 Nos. |

Actual Users are requested to register their requirements on production of R. C. Book with the Secretary, c/o Mahalaxmi Agencies, Pogathota, Nellore.

# పల్లెల వార్తావళి

## తోడేరు పంచాయతీ - నామ్‌కేవాస్తే వ్యవహారం

పొదలకూరు సమితిలోని తోడేరుగ్రామ పంచాయతీ అంటే సమితిరాజా కాకాణి రమణారెడ్డిగారి స్వంతగ్రామం. కాకాణి రమణారెడ్డి తొలుత సర్పంచియై సమితి రాజా అయినతర్వాత ఇంకెవరిమీద నమ్మ కంలేక ఆపూరి సర్పంచిగా తనసతీమణికే పట్టంగట్టారట. అంతవరకు బాగానేవుంది. ఒక స్త్రీ సర్పంచ్ అయిన ఘనతనుకూడా పొందింది తోడేరు.

అయితే ఆమె సర్పంచ్ అయిననాటి నుంచి ఇంతవరకు వొక్క పంచాయతీ మీటింగుకూడా జరగలేదట చిల్లిగవ్వెత్తు పనికూడా జరిగిందిలేదట. నెలనెలాజరక్క పోతేపోయింది, మూడునెల్లు, ఆరునెల్లు, తొమ్మిదినెల్లు కావస్తున్నా వొక్క మీటింగైనా జరగలేదట, కనీసం మీటింగు జరిపినట్లు, మినిట్స్‌బుక్కులో సంతకాలు చేయించినట్లు, మీటింగునోటీసులు సభ్యులకు పంపినట్లు రికార్డు సృష్టించనైనా లేదట. ఇంత దీర్ఘకాలంపాటు మీటింగ్ జరిపించకపోవడం చట్టరీత్యా నేరమట. అందుకని ఈ పంచాయతీని 'సూపర్‌సీడ్' చేయవల్సిందిగా పంచాయతీ ఆఫీసరుకు ఎన్ని కజ్జప్తులు పంపుకున్నా లాభంలేకపోయిన దానిమీదట ముగ్గురు పంచాయతీ సభ్యులు కలెక్టరుగారికి నేరుగా అర్జీ పంపుకున్నారట. తన సొంతవూరువ్యవహారాన్ని ఇంత అబందరగా పెట్టుకోనున్నారా సమితిరాజుగారు?

## సాత్ మోపూరు అగ్నిప్రమాదం

మొన్న 24 తేది అగ్నిప్రమాదానికిగురై సాత్ మోపూరులో 40 ఇళ్లు కాలిపొయ్యాయి; 31 ఇళ్లు వడ్డివాళ్లవి, 5 ఇళ్లు యాదవులవి, 4 హరిజనులవి. ఈ కరువు కాలంలో తలా కొంచెం దాచుకున్న జొన్నలు వగైరా తిండిగింజలు మసి అయిపోయినాయి. ఈ మంటల్లోనే 3 మేకలు, 1 పెయ్యకూడా కాలిపోయినాయి. మరు రోజు గడ్డివాములుకూడా కాలిపోయాయట. ఒక పిచ్చి స్త్రీ చేష్టయే ఈ అగ్నిప్రమాదానికి కారణమంటున్నారు. ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పగల్గింది. ఆర్.డి.వో., తహసిల్దార్, బి.డి.వో. గారలువచ్చి బాధితులకు తలా 50 రూపాయలు నగదు, ఇళ్లు కట్టుకోడానికి 4 బాటిమానులు ఇప్పించారట. వెల్లంటి వాస్తవ్యులు శ్రీ మారం రెడ్డి సుందరరామరెడ్డిగారు ఇంటికి 6గజాల కోరాగుడ్డ యిప్పించారట. —బి. వి.

## చల్లాయపాళానికి విద్యుత్ సప్లయి

బుచ్చిసమితి చల్లాయపాళెం గ్రామ వీధులు, కొన్నిఇళ్లు విద్యుత్ దీపాలకాంతితో గతమాసంలో జిగేల్‌మన్నాయి. సమితి రాజా మేనకూరు బాలకృష్ణారెడ్డి స్విచ్ ఆన్ చేసారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బి.డి వో సి. ఎస్. ఆర్. అంజనేయులు, కోరాబత్తిన చిన్నయ్య ప్రసంగించారు. గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి శ్రీ గ్రద్దలూరు శంకరయ్య 3 వేలు విరాళం యివ్వడానికి వాగ్దానం చేసారని, త్వరలోనే నిర్మాణం జరుగగలదనే ఆశాభావాన్ని వ్యక్తంచేసారు. సభానంతరం నాటికలు, వినోదకార్యక్రమాలుకూడా వుండినాయట. —బి. వి.

## కోట సమితి సభలు

నాందారమ్మపేట, పాలిచర్ల, వాకాటివారి ఇండ్రిగ, ఎగువరాజుపాళెం గ్రామాల్లో అనుకున్న సభలు యథావిధిగానే జరిగిపోయాయి. కలెక్టరు వీరరాఘవన్‌గారు మొన్నవారం జమీన్‌రైతులో పేర్కొన్నట్లుగానే నాందారమ్మపేట సభానంతరం మిగతా వూళ్లకు రాకుండానే వెళ్లిపోయారు. మిగిలిన ఆ మూడు గ్రామాల్లో నల్లపరెడ్డి సోదరుల ఆధ్వర్యాన సభలు జరిగిపోయాయి

నాందారమ్మపేటలో పశువులాస్పత్రికి కలెక్టరు ప్రారంభోత్సవంచేసిపోగా మిగతా మూడు గ్రామాల్లో వీధి దీపాలకు విద్యుచ్ఛక్తి బోర్డుసభ్యులు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి ప్రారంభోత్సవం చేసారు. జనం జాస్తిగానే వచ్చారు. అప్పుడే గూడూరునియోజకవర్గంలో వచ్చే ఎలక్షన్ వాతావరణం అలుముకున్నట్లుగావుంది. కలెక్టరు వొక్క నాందారమ్మపేటకు మాత్రమే వచ్చి మిగతా వాటికి రానని చెప్పడంతో వాతావరణం కాస్త వుద్రిక్తమైనట్లున్నది.

నాందారమ్మపేట సభకు కలెక్టరుతో బాటు గూడూరు సబ్‌కలెక్టరు డి. రామకృష్ణయ్య, మైకాస్పెషల్ డిప్యూటీ కలెక్టరు పి. వి. సుబ్బయ్యనాయుడు, జిల్లా పశువైద్యశాఖాధికారులు విచ్చేసారు. పనుపులేటి సిద్దయ్యనాయుడుగారుకూడా పాల్గొన్నారు. నల్లపరెడ్డి సోదరులు బంజరు-ఇండ్లస్థలాల సమస్యలపై తగులుకున్నారు. సర్పంచ్ తమ్మంచి శ్రీనివాసులరెడ్డి స్వాగతం చెప్పారు కలెక్టరు ఆంగ్ల ప్రసంగాన్ని సబ్‌కలెక్టరు తర్జుమాచేసి చెప్పారు. మూలపడవరోడ్డు వగైరా పనులు కరువు పనులక్రింద తక్షణం ప్రారంభిస్తామన్నారు. మిగతావూళ్ళ కార్యక్రమాలకు కలెక్టరు లేకపోయినా మామూలుగానే జరిపించారు. ఎగువరాజుపాళెంలో సర్పంచ్ ఎం. రామచరాజు పలావువిందుకూడా చేసారు. —బి. వి.

## అపీ - యిపీ

● రాపూరు సమితిలోని వడ్లపూడి పంచాయతీలో చేరివున్న చిరంపల్లికేమో విద్యుత్తు వచ్చిందిగాని, అక్కడకు 4 ఫర్లాంగుల్లోనేవున్న వెంకటాచలం సమితిలోని అక్కంపేటకు ఇంకా కరెంటు రాలేదేమని వొకరి ప్రశ్న. మీరు అడగలేదేమో!

● కందుకూరు తాలూకా హైస్కూల్ల హెడ్‌మాస్టర్లు మొన్న 2 తేది సమావేశమై సమ్మె కొనసాగించడానికే తీర్మానించుకున్నారట. ఎండల్లో హాయిగా వుంటుంది గదా!

● వున్నూరు పంచాయతీలో యింటి పన్నులువగైరాలు మొన్న మార్చి ఆఖరుకు నూటికి నూరుపాళ్లు వసూలు చేసారట.

## హైదరాబాదు లేఖ

(మొదటిపేజీ కొరవ)

కోసం వెళ్ళారు. వీరిలో చాలామంది స్వభాషను మరచిపోయారు. పెద్దలు కాకపోయినా పిన్నలు మరచారు ఐతే వీరిలో స్వభాషా చైతన్యం, దానిపట్ల ఆసక్తి మళ్లీ మొలకలెత్తాయి. తెలుగు విద్యాలయాలను స్థాపించుకున్నారు. అక్కడి ప్రభుత్వం కూడా సానుభూతి చూపుతున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకూడా ప్రోత్సాహాన్నిస్తున్నది. మారిషస్‌కు ఆంధ్ర రచయితల కళాకారుల ప్రతినిధులు వెళ్ళి రావడం కూడా జరిగింది.

సింగపూర్, మలయా, బర్మా, థాయిలెండ్‌లలోకూడా తెలుగువారు స్థిరనివాసమేర్పరుచుకున్నవారున్నారు. వీరందరితో సన్నిహిత సంబంధం ఏర్పడడం అవసరం. ప్రభుత్వపరంగాను అధికారపూర్వకంగాను కొన్నికొన్ని సంబంధాలు అక్కడి ఆంధ్ర సంఘాలతో ఏర్పడుతున్నాయి. కాని వీటికి వ్యవస్థారూపంలేదు. కేవలం రెండేళ్లకు మూడేళ్లకుజరిగే సభలకు ప్రతినిధులను పిలిపించినంత మాత్రాన చాలదు.

అసలు ప్రపంచ తెలుగు మహాసభ జరిపించడంలో వుద్దేశంకూడా వేరుగా వుండాలి. తమిళులనుంచి నేర్చుకొనడం అవసరం. ప్రపంచభాషల్లో తెలుగుస్థానం గూర్చిన అధ్యయనం పరిశీలన జరగాలి. ప్రాచీన భాషగా తెలుగు పరిచయం ప్రపంచానికి జరగాలి. ఆధునిక భాషగా, ఇతర ఆధునిక భాషలతో పోల్చి తెలుగు గురించి పరిశీలనలుజరగాలి. కొన్ని అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో తెలుగు అధ్యయనా సౌకర్యాలున్నాయి. కొందరు విదేశీయులు కూడా తెలుగు భాషాభ్యాసం చేస్తున్నారు. వీరందరినీ ఒక వేదికపైన సమావేశ పరచాలి. ఇది బృహత్తరమైన బాధ్యత. ఈ బాధ్యతా నిర్వహణలో ప్రభుత్వ సహాయం చాల్లాకావాలి.

శోచనీయమైన విషయమేమిటంటే ఇలాంటి మహత్తరమైన బాధ్యత తెలుగు వారికి సంబంధించిన ఇతర విషయాల్లాగే వివాదాస్పదమై పోయింది. అఖిలభారత తెలుగు రచయితల మహాసభవారేకాక మరొక బృందంకూడా రంగంలోకి దిగింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మామిడిపూడి వెంకటరంగయ్యగారి అధ్యక్షతన ఏర్పడిన సంఘానికి ప్రపంచమహాసభనునిర్వహించేటందుకు మొదటి సహాయంగా రూ 10,000లు గ్రాంటుగా ఇచ్చింది. ఈ సంఘం ఇంతవరకు ఏంపని చేసిందో తెలియదు. వెంకటరంగయ్యగారు సమర్థులైనా వయోవృద్ధులు, వారికి అండగా యువకులైనవారు కొందరుండాలి.

తమిళ మహాసభవలె ప్రపంచ తెలుగు మహాసభకూడా తెలుగు భాషాసంస్కృతుల చరిత్రలో నూత్న మలుపుగా పరిణమించాలంటే, యోగ్యులు పండితులు, ఈ మహత్తర కృషి ప్రాముఖ్యతలను బాగా అవగాహన చేసుకున్నవారు అందరూ కలిసి కనీసం రెండుసంవత్సరాలు ప్రయత్నానికి పూనుకోవాలి. అప్పుడుకాని ఇది విజయవంతంకాదు సార్థకంకాదు. కేవలం ప్రభుత్వోద్యోగులకు వదిలివేసినా, లేక సాహితీ లోకంలోని "రాజకీయ వాదుల"కు వదిలివేసినా శ్రమంతా వృథాపోతుంది.

## వెంకటగిరి రాజా

(మొదటిపేజీకొరవ)

వాదులుగా వున్నారంటే, ఆయన సంహా వనుసరించేనని మా అభిప్రాయం. రాజాగారు మైనర్ కమీషన్ సభ్యులుగా వుండినారు. నెల్లూరు జిల్లాబోర్డు అధ్యక్షులుగా, అవిభక్త మద్రాసు రాష్ట్రంలో ఎం. ఎల్. ఎ. గా, ఎం. ఎల్. సి గా వుండినారు. 1937 లో గూడూరు నియోజక వర్గం శాసనసభ ఎన్నికలలో జస్టిస్‌పార్టీ అభ్యర్థిగా ఓడిపోయారు. తర్వాత రాజకీయాలను పూర్తిగా విసర్జించినట్లే కనబడుతుంది.

రాజాగారు సామ్యస్వభావులు, శాంతమూర్తులు, సంస్కృతిపరులు, దైవభక్తులు. జమీన్‌దారీ రైతోద్యమ రోజులలోకూడా, రాజాగారంటే వ్యక్తిగతంగా గౌరవభావం వుండేది. వెంకటగిరి రాజాగారు దుబారా దుర్వ్యయాలెరుగనివారు. ఇంకో విశేషం - అందరు జమీందార్లవలెకాక, జమీన్‌దారీల రద్దు అనంతరంకూడా, ఆహోదాను సాంప్రదాయాలను వీడకుండా, ఎంతో హుందాగా గడపినవారు. ఆర్థికంగా అంతస్తు తగ్గనివారు. వ్యాపార పారిశ్రామిక దృష్టికలవారు. రాజాగారు ఎన్నోసార్లు విదేశ పర్యటనలు గావించారు. విశేషంగా పెద్దలతో పరిచయంగలవారు. అజాతశతృవుగా ఇహలోక యాత్ర చాలించారు. మంచి ఆటగాడు, వేటగాడు, వీరి వ్యాయామ విద్యాపారీణ్యతకు శతావధాని వేమూరి శ్రీరామమూర్తిగారి పద్యాలే సాక్ష్యం. కీ. శే దొడ్ల వెంకటరామరెడ్డి గారి 'దొడ్ల రామాయణం' మైత్రీ చిహ్నంగా వీరికే అంకితమివ్వబడింది

రాజాగారి మరణంతో నెల్లూరు ఒక గొప్పవ్యక్తిని కోల్పోయింది. తండ్రిని కోల్పోయిన కుమారరాజా, రాజకుమార్ గార్లకు మా సానుభూతిని తెలియజేస్తున్నాము. భగవంతుడు వారి ఆత్మకు శాంతిని ప్రసాదించుగాక!


**THE NELLORE TYRE DEALERS ASSOCIATION NELLORE.**

Wanted Immediately an experienced and smart CLERK well versed in office routine work and knows Typewriting- even recently retired persons also can apply. The job is temporary. Apply in own handwriting to:

The Secretary,
c/o Mahalaxmi Agencies
Pogathota - Nellore.


## నర్రవాడ శ్రీ వెంగమాంబ తిరునాళ్ల

నర్రవాడ (ఉదయగిరి తాలూకా) శ్రీ వెంగమాంబ తిరునాళ్ల ఈ క్రింది కార్యక్రమంప్రకారం జరుగును. భక్తులెల్లరు విచ్చేయప్రార్థన—

13-6-71 తేది ఆదివారము నిలుపు, 14-6-71 తేది సోమవారం ఉత్సవము, 15-6-71 తేది మంగళవారం ఉత్సవం (హరికథ), 16-6-71 తేది బుధవారం పెద్ద ఉత్సవము—రాత్రికి: హరికథ, డ్రామా ప్రోగ్రాములు కలవు, 17-6-71 తేది గురువారం పొంగళ్ళు — బండ్లు తిరుగుట.

ఇట్లు,
పచ్చా పెద్దన్న,
ధర్మకర్త,
శ్రీ వెంగమాంబ దేవస్థానం,
నర్రవాడ.


# విజయ్

విహా సుఖానికి దోహదం చేస్తుంది

మీ పని భారాన్ని తగ్గించేందుకూ, మీ జీవితాన్ని ఎక్కువ ఆనందదాయకంగా చేసేందుకూ విద్యుత్ సాధన సంపత్తిలో ఉత్తమమైన వాటిని విజయ్ మీకు సమకూర్చుతున్నది.



ఇస్త్రీ చేసేటప్పుడు ... విజయ్ ఐరన్ ... గృహిణికి ప్రత్యేకించి అనువుగా ఉండేట్లు తయారు చెయ్యబడింది. ... విజయ్‌తో ఇస్త్రీ చేసేప్పుడు వేడిమి ఎలా ఉంటోనని ఊహించవలసిన అగత్యం ఉండదు. కాగా, గుడ్డలు కాలటంవల్లగాని, సరిగా లేకపోవటంవల్లగాని కలిగే మనస్తాపం నివారింపబడుతుంది. విద్యుచ్ఛక్తి వాడకం ఖర్చు గరిష్టంగా కలిసి వస్తుంది. విజయ్ పంకాలు ప్రతి అవసరానికీ అనువుగా రకరకాల నమూనాలలోను, రంగులలోను లభిస్తున్నాయి. మీకు ఆజీవిత పర్యంతం శీతల సౌఖ్యాన్ని సమకూర్చేట్లు, రోజవారీ వాడకంలో ఖర్చు తక్కువగా ఉండేట్లు ఇవి ప్రత్యేక నైపుణ్యంతో తయారుచెయ్యబడినవి.

Vijay నేషనల్ ఎలెక్ట్రికల్స్
బారర్ బిల్డింగ్స్, 2/18, మౌంట్ రోడ్డు, మద్రాసు-2.

విజయ్‌తో విహారు సుఖంగా ఉండండి

NAS-199 TG

PHILIPS

స్టాకిస్టు : ఫోన్: 78.

సాయినాథ అండ్ కంపెని
ట్రంకురోడ్డు -:- నెల్లూరు.

# పోతన కవితారీతులు

బమ్మెర పోతనామాత్యుని భాగవతము తెలుగువారికి అభిమాన గ్రంథము. భారతమూ, రామాయణము కూడా లక్షించే. జనము అవి ప్రాజ్ఞలోకమునకేగాని, ప్రజా సామాన్యమునకు సులభగ్రాహ్యములుకావు. పండితులు, పామరులు, స్త్రీలు, పురుషులు, పిన్నలు, పెద్దలు- ఎల్లవారును అత్యంత ప్రీతితోఁ జదివి భాగవతమునే.

భాగవతము భగవద్భక్తి ప్రబోధకమగుటయేకాక, అందు దాలభాగము, మధుర శృంగారరసభరితమైన శ్రీకృష్ణుని దివ్యచరిత్రమగుటయు, మరియు నందలి కవిత్వము ప్రసాద సౌకుమార్య మాధుర్యాది గుణములచేత ఆహ్లాదసంధాయకమగుటయును అందుకు కారణములు.

సంగీతము ఆపాతమధురమనియు, సాహిత్యము ఆలోచనామృతమనియు నందురు. కాని, పోతన సాహిత్యము సంగీతమువలెనే ఆపాతమధురము.

పోతరాజు పద్యము, భాషాప్రౌఢిచేతగాని, భావగాంభీర్యముచేతగాని- ఒకవేళ, ఎక్కడనైనను- పూర్తిగా అర్థముకాకపోయినను, చదువువారికి-వినువారికికూడా అమృతపుసోన సోకినట్లు- ఆనందజనకముగనే యుండును. అది ఆ మహాకవి కవిత్వమునకు గల అనితరకవి సాధారణమైన ప్రత్యేక లక్షణము.

అతడు భాగవతమును లోకము మెచ్చుకొరకుగాని, ధనసంపాదనముకొరకుగాని రచింపలేదు. ఆత్మానందము కొరకును, భగవద్గుణ కీర్తనమువలన తన జన్మము సఫలము కావించుకొనుటకును రచించినాడు.

"...దీనిం దెలిఁగించి నా జనసంబున్ సఫలంబుఁ జేసెదఁ బునర్జన్మంబు లేకుండగన్"

"శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు, భక్తపాలన కళా......
(గ్రంథ ప్రారంభ పద్యము)

కైవల్యప్రాప్తియే పోతన ప్రధానవాంఛ. భవబంధముక్తికిని, పరమపదప్రాప్తికిని భగవద్ధ్యానముతప్ప మరియొక మార్గము లేదని గట్టిగానమ్మిన పరమభక్తుడతడు. మరియు భగవదనుగ్రహమునకు పాత్రము కానిజన్మ వ్యర్థమని ఆయననిశ్చితభావము. ఈ భావముతోనే, పెక్కు పద్యములు, తాను స్వయముగారచించి, భాగవతమున, ఆయా సందర్భములలో- పొందుపరచియున్నాడు. రెండుమూడు మాత్రమే ఇక్కడ ఉదాహరించుచున్నాను-

"చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగాఁ దలఁపడేని
కలుగనేటికిఁ- తల్లుల కడుపుచేటు"

"కమలాక్షునర్చించు కరములు కరములు
పవనగుంఫిత చర్మభస్త్రిగాక;
వైకుంఠుఁబొగడని వక్త్రంబువక్త్రమే
ఢమఢమధ్వనితోడి ఢక్కగాక,
హరిపూజనములేని హస్తంబుహస్తమే
తరుశాఖనిర్మిత దర్విగాక;
కమలేశుఁజూడని కన్నులుకన్నులే
తనుకుడ్యజాల రంధ్రములుగాక;
చక్రిచింతలేని జన్మంబు జన్మమే?
తరళసలిల బుద్బుదంబుగాక;
విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువుగాక."

ఇదే భాగవత సారాంశము. ఇదే పోతన ప్రహ్లాద ముఖమున లోకమున కందించిన సందేశము. ఇదే, ఆ మహానుభావుడు, అజ్ఞాన నిద్రాముద్రిత ప్రపంచమునకు కావించిన ప్రబోధము.

## పోతరాజు - త్యాగరాజు

తెనుగు వాఙ్మయమున పోతరాజును పోలిన కవి త్యాగరాజొకడు కనబడుచున్నాడు. ఇతడు పద్యకవి, అతడు పదకవి- యున్న భేదమొక్కటితప్ప, జీవితవిధానమునను, కవితా వ్యాపారమునను-ఆయిరువురు కవిరాజులును ఒక్క పోలికవారే.

ఇరువురును ఐహిక సుఖములను నిరసించిన విరాగులు. ఇరువురును శ్రీరామ భక్తులు. పోతన, భాగవతమును - రామభద్రుడే తనచేత పలికించినట్లు చెప్పుకొన్నాడుగదా! వారిరువురును తమ కవితా కళాకౌశలమును భగవత్కీర్తి కీర్తనమునకే వినియోగించిన విమల హృదయులు. ఇరువురును తమ యకలంకభక్తి భావనచేత శ్రీరామచంద్రమూర్తిని ప్రత్యక్షము కావించుకొని, తదనుగ్రహమును పొందనోచిన పుణ్యమూర్తులు.

కావుననే పోతరాజు పద్యములూ, త్యాగరాజకృతులూ, భగవద్భక్తుల యొక్కయు సంగీత సాహిత్య రసికుల యొక్కయు రసనాంచలములందు, యీనాటికిని-అవిరతముగా- ఆనందలాస్యము చేయుచున్నవి.

## పోతన పాండిత్యము

భక్తివిషయమట్లుండగా, పోతన, నన్నయ తిక్కనాదులతో సరిగా నెన్నదగిన

## శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

గొప్ప విద్వత్కవిగాని, కేవల కవికాడు. 'ఈ సంగతి ఆయన భాగవత రచనవల్లనే విశదమగుచుండగా, మీరు ప్రత్యేకించి చెప్పుటయెందుకందు'రుకాబోలు!

"పోతన కవియేకాని, పండితుడుకా" డనువారు కొందరున్నారు. అందుకే నేనీమాట చెప్పవలసి వచ్చినది. మరియు, పోతన లక్షణజ్ఞుడు కాడన్న ప్రవాదమొకటి, పండిత లోకములో- బహుకాలముగా పాదుకొనియున్నది. దానినిగూర్చి చెప్పవలసినది యెంతోకలదు కాని, అదర్వపండితులకేకాని, అందరికిని నచ్చదు.

పోతన తనది సహజ పాండిత్యమని చెప్పుకొన్నాడు. సహజపాండిత్యమనగా, స్వయంకృషిచేత సమకూర్చుకొన్న పాండిత్యమని భావము. పాండిత్యము సహజమైనను, ఆయన తెనుగు మీదను, సంస్కృతము మీదనుకూడా, సరిసమానమైన సంపూర్ణాధికారము కలవాడు. కావుననే,-

"కొందఱికిఁ దెనుఁగు గుణమగుఁ
గొందఱికిన్ సంస్కృతంబు
గుణమగు; రెండుం
గొందఱికి గుణములగు, నే
నందఱ మెప్పింతుఁ గృతుల
నయ్యైయెడలన్"

అని ధీమముగా ప్రతిజ్ఞచేసినాడు.

అంతేకాదు; తిక్కన,- "నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుఁడన్" (నిర్వ. రా. 1-13) అని చెప్పుకొన్నట్లే, తానును,- "నేనుభయకావ్యకరణ దక్షుండ" నని చెప్పుకొన్నాడు.

## కవిత్రయ ప్రశంస

పూర్వకవులను సంభావించుటలో పోతన, నన్నయను- "ఆంధ్రకవితా గౌరవజనమనోహరు" యని కైవారము చేసి, తిక్కనను- "హరిహర చరణారవింద వందనాభిలాషి" యని భూషించినాడు.

అతడు ఎఱ్ఱాప్రెగడను పేర్కొన్నట్లు ముద్రితప్రతులలో లేదుగాని, తంజావూరు సరస్వతీమహల్ లైబ్రరీలోని ఒక తాళపత్ర ప్రతిలో,- "శక్తివిశేషిత పరమేశ్వరుండగు ప్రబంధ పరమేశ్వరుం బ్రణుతించి" అను పాఠమున్నది.

ఇట్లా ముగ్గురుకవులను వినుతించినను, "నన్నయను- ఆంధ్ర కవితాగౌరవ జనమనోహరు" యని కైవారము చేయుటను బట్టి చూడగా, పోతనభావము- కవిత్వ విషయమున- నన్నయవైపే మొగ్గుచూపినట్లు కనబడుచున్నది. అది సత్యమేనని, పోతన రచనలలోని సప్రసన్న వాక్యము, అన్వయ సౌకర్యము, శయ్యా సౌభాగ్యములతోడి దీర్ఘసమాస ఘటనము ప్రకటపరచుచున్నది.

## అనుకరణము

పోతన పైముగ్గురు కవుల రచనలనూ అనుకరించియున్నాడు. ఆ యనుకరణము లోనూ - నన్నయ రచనానుకరణమే హెచ్చుగానున్నది.

నవమస్కంధమున, దుష్యంతుని కథలో - మూలమునలేని వేటవర్ణనము, కణ్వాశ్రమవర్ణనము ప్రవేశపెట్టబడినవి.

ఆ వర్ణనలు రెండును, నన్నయగారి (ఆది. 4 ఆ.) దుష్యంతకథలోని వర్ణనలకు ప్రతిబింబములు. మరి విశేషమేమనగా నన్నయ వేట వర్ణనము-మూడు కందములు. పోతనదియును-మూడుకందములే. నన్నయ ఆశ్రమవర్ణనము - సీసము. పోతనదియును సీసమే.

ఈ క్రిందిపద్యము నన్నయది:-

"జలధి విలోలవీచి విల
సత్కాంచి సమంచితావనీ
తల వహనక్షమంబయిన
దక్షిణ హస్తమునందదున్న మ
ద్గళదురు ఘర్మవారికణ
క్రమ కరాబ్జమువట్టి నూతిలో
వెలువడఁ గోమలిం దిగిచె
విశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్"

ఈ క్రింది పద్యము పోతనది:-

"సప్తాంభోనిధి మేఖలావృత మహా
సర్వంసహా కన్యకా
ప్రాప్తోద్యద్వరదక్షదక్షిణ కర
ప్రాలంబముం జేసి ప్రో
త్క్షిప్తుం జేసె యయాతి నట్టికొనఁ జై
చేలంబు మున్నిచ్చి ప
ర్యాప్తస్వేద జలాంగి నాళి నముదా
య స్వర్గవిన్ భార్గవిన్"

"వీరెవ్వరు శ్రీకృష్ణులు
గారా! యెన్నఁడును వెన్నఁగానరటకదా!
చోరత్వం బించుకయును
నేరరఁట! ధరిత్రినిట్టి నియతులుగలరే?"

ఈ భాగవత పద్యము,-

"వీరెవ్వరయ్య ద్రుపద మ
హారాజులె? యిట్లు కృశులు
లయి పట్టువడన్
వీరికి వలసెనె? యహహా మ
హారాజ్య మదాంధకారమదివాసెనొకో?"

అను నన్నయపద్యమునకు అనుకరణము.

"ప్రాణంబుతోఁగూడ రక్కసిచన్నుల
పాలుద్రావిన ప్రౌఢబాలుఁడితఁడె"

అను తిక్కనసీసమునననుసరించి, పోతన,-

"వీడటే రక్కసి విగతజీవిగఁ జన్నుఁ
బాలుద్రావిన మేటి బాలకుండు!"

అను సీసమును వ్రాసినాడు.

ఈ క్రిందిపద్యము ఎఱ్ఱాప్రెగ్గడది-

ఊషరబీజముల్ భసిత
యోజ్యఘృతంబులు షండకన్యకా
న్వేషణముల్ పయోధిగత
వృష్టితతుల్ మృగతృష్ణికాంబుగం
డూషలు దుర్గకానన క
శోరిత చంద్రిక లేటి మూకస
ద్భాషలు విష్ణు మంగళ క
థా విముఖాత్ముల దుష్టజన్మముల్."
(నృసింహపురాణము, 5-24)

ఈ పద్యములోనిభావమే, పోతనగారి అనుకరణమున ఈ క్రింది విధముగా రూపొందినది-

కావలి వర్తమాన సమాజార్ద్ర్యంలో జరిగిన పోతన జయంతిలో శ్రీ అకిలి మల్లికార్జునయ్య బహూకృతినందుకుని శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిచేసిన ప్రసంగపాఠం

"అంధేందూదయముల్ మహాబధిర శం
ఖారావముల్ మూకస
ద్గ్రంథాఖ్యానములు నపుంసకవధూ
కాంక్షల్ కృతఘ్నావళి
బంధుత్వంబులు భస్మహవ్యములు లు
బ్ధద్రవ్యముల్ క్రోడస
ద్గంధంబుల్ హరిభక్తివర్జితుం రి
క్తవ్యర్థ సంసారముల్"

అనుకరణమైనను, లోకములో, ఈ పద్యమునకున్నంత ప్రచారము తొలిపద్యమునకు లేదు. ఇంతకును పోతనపద్యము అమూలకము అది యొక్కటియే కాదు; ప్రహ్లాద చరిత్రలోని అనేకపద్యములు అమూలకములే.

ఇంతయేమునకు? పోతన గ్రంథములోనున్న సత్యభామయుద్ధము భాగవతములోనిదికాదు; హరివంశములోనిది. పోతన ఆ కథను నాచనసోముని ఉత్తర హరివంశమునుండి కైకొని దానికి మెరుగులు దిద్దినాడు. అంతేకాదు; సోముని రచనా చాతుర్యమునకు ముచ్చటపడి, అతని రచనలనుకూడా అనుకరించినాడు. మచ్చుకు ఒక్క పద్యము-

"అలిగిజూచుజూ హరిఁజూచుఁజూచుకములం
దుదంచ మందార శే
ఖరమాలామకరంద బిందు
సలిలస్యందంబు లందంబులై
తొరఁగన్, బయ్యెద కొంగుకింత
తొలఁగన్ దోర్దోశరాసారమున్
దరహాసామృతపూరమున్ గురియుచున్
దన్వంగి హేలాగతిన్"

ఈ పద్యము సోమనాథునిది

"పరుఁజూచున్ పరుఁజూచు నొంపవలదిం
పన్ రోషరాగోదయా
విరత భ్రూకుటి మందహాసములతో
వీర శృంగారముల్
జరగన్ గన్నులఁగవుఁ గొవు
బరఁగం బరాస్త్ర సందోహమున్
నరసాలోక సమూహమున్ నెఱపుచున్
జంద్రాస్య హేలాగతిన్"

ఈ పద్యము పోతనది-

ఈ పద్యములో పోతన సోముని అడుగుజాడలలోనే నడచియు, స్వప్రతిభా విశేషముచేత, తన పద్యమున కొక సరిక్రొత్తదనమును సమకూర్చినాడు.

ఇక్కడ చెప్పవలసిన విశేషమొకటి యున్నది. అది యేమనగా: పోతన, నన్నయ తిక్కనాదు గ్రంథములతో పాటు, శివకవియైన పాల్కురికి సోమనాథుని బసవపురాణముకూడా చదివి, అందలి భావములనూ కొనికొన్నాడు.

ఈక్రిందిద్విపదలు బసవపురాణములోనివి-

"క్షీరాబ్ధిలోపలఁ గ్రీడించుహంస
గోరునే పడియల సిరుదాఁపఁగఁ?
జాతఫలంబులు సుంబించు చిలుక
భాతి బూరుగుమ్రాని పండ్లు గన్గొనునె?
రాకామలజ్యోత్స్నఁ ద్రావు చకోర
మాకాంక్ష సేయునే చీకటిద్రావ?"

ఈ ద్విపదలలోనిభావమే, పోతనచేతిలో,-

"మందారమకరంద మాధుర్యమునఁదేలు
మధుపంబు వోవునే మదనములకు?
నిర్మల మందాకినీ వీచికలఁదూఁగు
రాయంచ చనునె తరంగిణులకు?
లలితరసాలపల్లవ ఖాదియైచొక్కు
కోయిలచేరునే కుటజములకుఁ?
బూర్ణేందు చంద్రికాస్ఫురిత చకోరకం
బరుగునే సాంద్రనీహారములకు?"

అను సీసముగా రూపొందినది.

ఈ విధముగా, ప్రాచీన మహాకవుల రచనలతో సరితూగునట్లు- ఒక్కొకయెడ మించునట్లుకూడా - రసవత్తర రచనలు కావించిన పోతనామాత్యుని శక్తిసామర్థ్యములు నిరుపమానములు గదా!

(ఇంకావుంది)

---

# శివారెడ్డి పద్యాలు

## మధుమేహం

మనజయప్రదమ్మ మధుమేహమునుగూర్చి
వ్రాస్తె ఎన్నోపుటలు పరుసబెట్టి
దాన్నిజూచెతలికి దడబుట్టి సాగించె
కొట్టుకుంటె యిదొక క్రొత్తజబ్బు!

ఇదివరదానికన్న పద్యాలు పాటల్లా!
పుండైనానికన్న పుట్టించిన
యిష్టమైన ప్రకృతి తప్పిగా బతికుంది
దాటుకున్నవాడు ధన్యజీవి.

## వివాహాలు - విందులు

మ్రేలుపెడితె నేను విందుల్ని గుర్తుంచి
పారబడితె కొన్నిపత్రికల్లో
నాటుపురమునరుకు నను లెక్కగడుతుంది
తిండిపోతు క్రింద తెలుసునాకు

రాకపెడితె త్రాగుపోతుల్ని గుర్తుంచి
కేసుబడితె జూదరులనుగూర్చి
రాకబడితె తప్ప, పాకాల్ని గుర్తుంచి
తూచిసెపితెతప్ప తుడుముగాడితె?

నవ్వు లొలకపోస్త నవ్యసాహిత్యంలో
అడుగుముందుకేస్త, హాజరయ్యి
ముందుగానెవొయ్యి విందు భోంచేసొస్త
సిగ్గువేర్చి రాస్త నెమరువేస్త.

## కాటంరెడ్డి కళ్యాణం

మాటలు చాలవు పొగడగ
కాటంరెడ్డోరిదైన కళ్యాణము ఆ
ర్భాటము ఎంతని తెప్పుదు
చోటులేదు కాలుమోప న్యూస్లోకవికిన్.

ఆడవారిసంఖ్య అధికమ్ము, మగవారి
సంఖ్యకొద్ది, పూఁసారమంటొ
కలిసిమెలిసి వచ్చె కల్యాణకాలమ్ము
వాసిగూర్చె కనుల గాసిదీర్చె!

అదరమ్ము నెఱపి ఆలింగనముజేసి
పెద్ది పల్కరించి పెళ్ళిమర్చి
విందుపెట్టె అప్త బంధుమిత్రులపెళ్ళ
వెంకటరామిరెడ్డి వేయిగతుల!

చిన్నరు ఎంతోపెద్దరి
చిన్నవి ద్వారాలు పైన సిబడి లా
ఎన్నో సమస్యలు శ్రమపడ
కున్న లభిస్తుందా కోడికుర్మా, తండ్రీ!

విజాగ్రదొక్కుతాయి విందుకుంటె కాళ్ళ
పెద్దపెద్ద తలలు పేరునాడి,
కొంపదేసుకున్న కొద్దిమట్టులు ఖర్చు
ముందుగానె కాస్త పెంచలాత్తె.

## మేంతవారి పెళ్లి

వాకాడు లంగమంతా
యేకమ్మడి వచ్చివడ్డ దేముడెవ్వరిన్
ఆ కళ్యాణ మహోత్సవ
మీ కన్నులు చూచిచూచి యెంతోమురిసెన్

పాతకాలపోడ్డి పైమిద్ది పైకెళ్ళి
తప్పుదార్నిబడ్డ తెప్పరిల్లి
మళ్లి క్రిందికొచ్చి మముబట్టిచూచింది
దారిపోయిగు మేంతవారిపెళ్ళి!

శేషురెడ్డి నలుపు కేప్టెనపింగాడు
కన్య దేవకన్య కలదు యెఱుపు
చదువుకున్న జంట కొదువ పిముందంట?
ఎఱుపు నలుపు విషయమెందుకంట!

అగ్గిపాటిపొయ్యి అలసొస్తె అయ్యోను
ఎంతదెబ్బకగిలి వీమ్మిటీని
బన్సకీమువెళ్ళి అంగిట్లోబోశారు
పద్మనాభరెడ్డి పచ్చివాయి!

# రైతు లోకం

## మెట్టవరి : పిచికారీద్వారా యూరియా ఎరువు లాభాలు

మెట్టప్రాంతాలలో వర్షాధారంతో వరి, గోధుమ పండించేవారుకూడా రూపాయకు మూడురూపాయలు లాభం సంపాదించ వచ్చును. క్రొత్తఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనాసంస్థవారి పరిశోధనల వలన ఇందుకై ఒక క్రొత్త విధానం రూపొందింది.

మెట్టప్రాంతాలలో వర్షాభావం వలన రసాయన ఎరువులు వేయడానికి వీలులేదు. అందుచేత వరి, గోధుమ దిగుబడులు తక్కువగా వుంటున్నాయి. కనుక ఇటు వంటి ప్రాంతాలలో ఈ పైర్లపై యూరియా ఎరువును పిచికారీ చేయడంద్వారా అధిక దిగుబడులు లభిస్తాయని ఇప్పుడు తెలియ వచ్చింది. యూరియాను పైరు పొట్టాకు తొడగడానికి 15-20 రోజుల ముందుగా చల్లితే, పైరు ఆ ఎరువువలన గరిష్ఠలాభం పొందగల్గుతుంది.

సువిశాలమయిన పొలాలయితే, విమానాలద్వారా ఎరువు చల్లడం శ్రేయస్కరం.

ఇదులక్ష్యమై జరిగిన ప్రయోగాలలో మధ్యప్రదేశ్‌లోని రాయపూర్, బిలాస్‌పూర్ జిల్లాలలో 4800 హెక్టేర్ల మెట్ట వరి పైరును ఎన్నుకున్నారు. అట్లాగే కోట (రాజస్థాన్) జిల్లాలోని 2000 హెక్టేర్ల మెట్ట గోధుమపైరునూ ఎన్నిక చేశారు. వీటిపై విమానాల సాయంతో 20-23 శాతం యూరియా పిచికారీచేశారు. సాంద్రమైన మోతాదులో చేసిన ఈ యూరియా పిచికారీవలన ఆకులు మాడలేదు సరికదా కొన్నివారాలలో పచ్చగా ఏపుగా పెరగ సాగాయి.

వరిపైరుపై 20 శాతం యూరియా ద్రావణాన్ని (17.8 కిలోల యూరియా అనగా 8 కిలోల నత్రజని 89 లీటర్ల ద్రావణంగా) పిచికారీ చేశారు. దీని ఫలితంగా వరిదిగుబడి 15.4 శాతం పెరిగింది. సగటున-పిచికారిచేసిన ప్రతి కిలో నత్రజనికీ 34.5 కిలోల వరిధాన్యం లభించింది. అనగా యూరియా పిచికారీఫలితంగా హెక్టేరుకు 3 క్వింటాళ్ళు ధాన్యం అదనందా ధాన్యం లభించింది.

గోధుమపైరుపై 23.5 శాతం యూరియా ద్రావణాన్ని (17 కిలోల యూరియాను అనగా 7.6 కిలోల నత్రజని 73 లీటర్ల ద్రావణంగా) చల్లారు. గోధుమ దిగుబడి 31 శాతం హెచ్చింది. అనగా పిచికారీ చేసిన ప్రతి కిలో నత్రజనికీ 24 కిలోల గోధుమలధాన్యం వండాయి.

హెక్టేరు వరిపైరుమీద యూరియా పిచికారీ నిమిత్తం 41 రూపాయలు ఖర్చవగా 130 రూపాయలు అదనంగా నికరలాభం వచ్చింది. హెక్టేరు గోధుమపైరుపై పిచికారీకి 41 రూపాయలు ఖర్చుచేయగా 125 రూపాయలు ఎక్కువ నికరలాభంవచ్చింది.

కనుక విమానాల ద్వారా చేసిన యూరియా పిచికారీకని ఖర్చుచేసిన ప్రతి రూపాయకూ మూడురూపాయలు అధిక లాభం వచ్చింది. కనుక మెట్టప్రాంతాల రైతులుకూడా ఈ విధంగా తమ వరి లేక గోధుమ పైరులపై యూరియా ఎరువును పిచికారీ చేసి అధికలాభాలను పొందవచ్చును. -[ఎఫ్. ఐ. యు.]

---

# 40 ఏళ్లనాటి 'జమీన్ రైతు'లో

40 ఏళ్లక్రితం మాంటేగ్ ఛేమ్సుఫర్డ్ సంస్కరణలమూలంగా దేశంలో మొదట ఎలక్షన్లు ప్రవేశపెట్టబడినప్పటినుండి ఈ ఎలక్షన్లనే ఎండమావులవెంట పరుగెత్తడమే మన పనైపోయింది. ఎలక్షన్లో ఫలానా ఆయన (లేదా ఫలానాపార్టీ ఆయన) గెలిస్తే ఫలానా ప్రాజక్టులు, ఫలానాపనులు జరుగుతాయనే వాగ్దానాల అరచేతివైకుంఠం అశచూపి వోట్లురాల్చుకొని ఫలానా అభ్యర్థి వ్యవహారంగా గద్దె కెక్కిన తర్వాత అఫలానా వ్యక్తి ఐపేవుండడు, ఆ పనులు జరిగేదిలేదు, ఆ ప్రాజక్టులు వచ్చేదిలేదు. ఈ నలభైఏళ్లనుంచి జరుగుతున్న తతంగం యిదే. మొదట 1926-27 ఎలక్షన్లొచ్చినపుడు వెంకటగిరి రాజాగారు మోటార్లలో పల్లెటూళ్లకువెళ్లి ఏవాగ్దానాలు చేసిందీ క్రింద చదవగలరు.

మొదట ఎలక్షన్లొచ్చినప్పుడు-ఎవరంటే వారు వోటర్లుగాదు-సంవత్సరానికి 200 రూపాయల శిస్తుగాబోలు చెల్లించేవారు మాత్రమే వోటర్లుగా వుండేవారు, తర్వాత అక్షరాస్యులైనవారుమాత్రమే వోటర్లు; అతర్వాత అందరూ వోటరులై కూర్చున్నారు ఎలక్షన్ స్వరూపం మారుతూ వచ్చినా స్వభావంలో ఏమార్పులేకుండా వుంటున్నది.

"శాసనసభ్యుల సత్యభాషలు" అనే శీర్షికక్రింద 16-3-1930 తేది 'జమీందారీ రైతు' పత్రికలో రాపూరు తాలూకా పార్లపల్లి గ్రామకాపురస్థుడు కె. వెంకటసుబ్బయ్య వ్రాసిన ఈక్రింది రాజకీయ వ్యాఖ్యాన రచన 40 ఏళ్లతర్వాతకూడా గమనించతగినది. అవధరింపుడు:

"శాసనసభ్యుల యెన్నికలుజర్గి యిది నాల్గవసంవత్సరము. మరల ఎన్నికలు త్వరలోనే జరగనున్నవి. మన నెల్లూరు జిల్లాలో పోటీయేయుండదని తలంచెద. శ్రీ కృష్ణరావుపంతులువారు (అమంచర్ల సుబ్బుకృష్ణరావు పంతులుగారు) కొంత వరకు వరుగులిత యిచ్చగించినను ముందు బోయిన నూయి వెనుక గోయి యన్నట్లు అయింది పాపమువారిస్థితి.

"స్వరాజ్యసంసిద్ధికై పాటుబడు నాయకులలో శ్రీ పంతులు వారొకరు, ఈమధ్య మహాత్ముడు ఆంధ్రదేశ పర్యటనము గావించినప్పుడు, కొంతవరకు మన పంతులువారు వారితోడ దిరిగిరి. ఇటీవల లాహోరు కాంగ్రెసు సిద్ధాంతాన సహజముగా పంతులువారు పోటీ చేయుటకు వీలుండదు. కనుక పంతులువారు మద్రాసు శాసనసభా సభ్యత్వముమీద యాశనువదిలి దేశసేవ యందు మేటి యనిపించుకొనిన మిక్కిలి బాగు.

"అయితే శ్రీ పాణకా గోవిందురెడ్డిగారు స్వరాజ్యవాదిగా గత ఎలక్షనులో నిల్చియుండెనే, శ్రీనాయుడుగారు (అతైన పేరు మాల్లనాయుడుగారు?) అసెంబ్లీ సభ్యత్వస్థానమును వదులుకోగా రెడ్డిగారు వారిస్థానే యేల పోటీచేసారు అని అంటారేమో. తొలుత స్వరాజ్యవాదులు శాసనసభలకు వెళ్ళి హోరాహోరి పోరాడి స్వరాజ్యమును సంపాదించవలదనియు ఆరు సంవత్సరముల యనుభవముచే యాశలు వదలి శాసనసభలనుండి యిప్పుడు మరలినను, మన రెడ్డిగారు శాసనసభలలో ప్రవేశించి, స్వరాజ్యమువ్యము యే 'రావుసాహెబో' యే 'రావుబహద్దూరో' బిరుదులను బడయగలరని మిత్రుల బోధనలచే యిలాగు చేశారుగాని వారు మొదట స్వరాజ్యవాదులే. మతక అద్దరునే కట్టేవారు. మన పంతులుగారికి అలాంటి మిత్రులులేరు అలా చెయ్యరు. 'సహవాసదోషే గుణాభవంతు' అను లోకోక్తి మనరెడ్డిగారియందు నేటికి సార్థకమాయెను.

"గడచిన శాసనసభా యెన్నికలలో శ్రీ కుమారరాజాగారు వారు పుట్టిపెరిగి చూడని రకరకాల పల్లెటూళ్ళకు మోటార్లలో వెళ్ళి కనబడిన రైతులకెల్ల సలాములు చేసి, షేక్‌హ్యాండులిచ్చి అచ్చ బుచ్చటు గావ్వగావ్వ సభలజరిపి, రైతులకు లేనిపోని యాశలుచెప్పి రాజకీయమున మీకు గల్గు యిబ్బందులలో శాసనసభాసభ్యుల సహాయ్యమున విముక్తి గావలసినవన్నియు చేయుభారము నాదనియు, మీసంతోషమే నా సంతోషమనియు, అందులో ముఖ్యముగా నాసెల్లా ప్రదేశములకు నీటిపారుదల వసతియుండియు లేనివారివలె మెట్టపైర్ల ఆధారముతో జీవించు రైతుల పేదరికముజూచి సహించజాలననియు, అట్టి వసతులను త్వరలో కలగచేయుటకే నేని సభ్యత్వమునకు పోటీచేసితిననియు, కాల పరిస్థితులనుబట్టి నా యుద్దేశమును పట్టుదలయు కపటమెరుగని రైతుసోదరులకు వెల్లడించుటకుగా ప్రతిపోటింగు అధికారపురయితును చూడవలసి వచ్చెననియు మొదలుగాగల విషయములుచెప్పి రెండవ అభ్యర్థికిం తనకును షుమారు మూడు నాలుగువేల వోట్ల వ్యత్యాసమున జయమొందిరి.

"వీరు శాసనసభాభ్యర్థిగా యెన్నుకొనునదిమొదలు యిప్పటికి సభ్యుల సమావేశం యెన్నిమారులో జరిగియుండును. పాపము శ్రీ రాజాగారు తమబుద్ధి వట్టుదలను మొట్టు మరల్చుకొనిరోకాని, యింతవరకు వారు యేవిషయమునుగురించియు సభలో నోరుదెరచిన పాపమున బోయినట్లులేదు. మాటుస్థితి, వారి సత్యభాషలు యిందు తెల్లమగుచున్నవి.

అయ్యో! కానోక ప్రభువే ఈ చిన్న విషయము తానేల యొదించకపోయెనందురేమో? తన పరిపాలనకు లోబడియుండు రయితులవల్ల ఫలితాకల్పములు అనుభవించువాడు తానయియుండి ప్రజల కష్టసుఖములను బాగుగా గుర్తెరింగిన వారిలో వ్యథమడయియుండిన తానే తన గ్రామాదులలోని చెరువులను గట్టిపరచుకొనలేక పయిరు వారు సిస్తులను దండుకొను మహాప్రభువు జంగళద్యకాల్వను రప్పించుటకు దీక్షబూని కంకణము కట్టుకొననునూ. నమ్మదగినదేనా? తన కెట్లు చెల్లును.

"తమరయితులే 'అల్లో రామచంద్రా' యని మార్చి యేప్రిలు నెలలలోనే త్రాగుటకు సహితము నీరుదొరకక మొత్తుకొనుచుండ కోరు గ్రామాదిరయితుల అభివృద్ధిని గూర్చి పోరాడుటకు తనకు సాహసముండునా. ఒక కార్యమును నిర్వహించుటలో యితరులు తనకార్యమును ఆక్షేపించుట తటస్థించిన కార్యసాధనకై హోరాహోరిగ పోరాడవలెనే. ముఖముజూపి నోటితోమాటాడవలెనుగదా. వీనికితోడుగా ధైర్యసాహసములు మన రాజావారులకి యీశ్వరుడు ప్రసాదించిన మన కార్యము అఖండ దిగ్విజయమయి యుండెడిదేమో. శ్రీయుత మరుపూరు కోదండరామరెడ్డికి భవిష్యత్తునుగూర్చి కొంత అనుభవమున్నట్లున్నది. వారు తొలుదొల్తనే వీరి గుణాతిశయములు ధైర్యసాహసములను పేర్కొనిరి. అయితే గొరైదాటుగా మారింది..." ——

---

## వారం....వారం....

(8వ పేజీకొరవ)

సాన్ని కలిగించడంలేదు. అత్యంత శోచనీయం." అవునవును, అత్యంత శోచనీయం!

"స్థలాను సేకరించి యిండ్లకోసం హరిజనులకిచ్చినట్లు ఉత్తర్వులుజేసినా అవి నిరుపయోగమైనవి. పరిహారం పొందిన భూస్వామి ఆ స్థలాన్ని స్వంత సేద్యం క్రిందనే వుంచుకున్నాడు. ఎవరికోసం ఇటువంటి కార్యక్రమం?" చక్కని ప్రశ్న!

"షెడ్యూల్డ్ తరగతులు, తెగలు, వెనకబడిన జనంకోసం ఉద్దేశించబడిన కార్యక్రమాల అదలు ఎక్కువ ప్రోత్సాహకరంగా సాగలేదు." నిజమే, సాగలేదు!

"కంట్రాక్టర్ పద్ధతిలేకుండా పల్లెలలో పనులుచేయించేపద్ధతి అమల్లోకి రావలెను. సహకారసంఘాలలో ప్రజలకు విశ్వాసం లేదు. అందువలన, మంచి లేబర్ కోఆపరేటివ్ సంఘాలేర్పరచి, విశ్వాసాన్ని కలిగించవలెను. పనిపాటలు దొరకని పల్లెసీమల ప్రజలందర్నీ ఇందులోకి లాగవలెను." షెభాష్!

"సమాజంలో ఎక్కువ తక్కువలధికమైనవి. ప్రజలిక సహించరు. సోషలిజమును ఈ దృష్టితో అవగాహన జేసుకుని అత్యవసరంగా, అతి ముఖ్యంగా, అతి తీవ్రంగా కృషిచేయవలసియున్నది." దివ్యమైనమాట!

"పొట్టకోసమా మనం సోషలిజం పేరిట బలహీనవర్గాలను కాడదీయడం?" కానేకాదు. మరెందుకు?

"అదొక ధర్మం. ఆర్థిక సామ్యవాదానికి, ఉన్నతికి అదేమార్గం. అందుకని సోషలిజం అంటున్నాము." ధర్మమేగదామరి!

సంజీవన్న, బ్రహ్మయ్యగారలకంటె చెన్నప్ప ఎనే మెరుగు. ఒక ప్రత్యేక రాష్ట్రోద్యమాన్ని నడిపి, నిర్బంధింపబడి, విడుదలచేయబడక ముందే తన ఉద్యమ విజయాన్ని కనుచూపుమేరలోకి తెచ్చుకున్నాడు. ముఖ్యమంత్రి ఈతడు లేవదీసిన ప్రశ్న ఒకసమస్యేగాదని ఘంటాపథంగా చెబితే, తెలంగాణా సమస్య రుజువైనట్లు ఎన్నికలే తెల్పినవని కాంగ్రెస్ అధ్యక్షుడు-మాజీ కేంద్రమంత్రి అన్నాడు. ఇప్పుడు ప్రధానమంత్రే చర్చలకు చెన్నారెడ్డిని పిల్చింది. ఈ చర్చల పర్యవసానం ఈ పంక్తులందేలోపుగా విషయజ్ఞులకు తెలిసేవుంటుంది.

తెలంగాణా ప్రజాసమితి (TPS) ప్రధాన కార్యదర్శి నరోత్తమరెడ్డి అభిప్రాయంలో ప్రత్యేకరాష్ట్ర వాంఛను ప్రధానమంత్రి యొదేర్పడంలోనే చెన్నారెడ్డి-ప్రధాని సంప్రదింపుల సారస్యం వుంటుందని, ఏక - ఆంధ్ర - ప్రదేశ్ చట్రంలోనే మార్పులకు అంగీకరించే పట్టుదల ప్రధానికివుంటే పరిష్కారం కుదరదనీ, గమ్యాన్ని చేరడానికి సోపానంగామాత్రమే చెన్నారెడ్డి చర్చిస్తున్నాడనీ తెల్పినాడు. తెలంగాణా ప్రజాసమితి వైఖరిలో మార్పు లేదనీ ప్రత్యేక తెలంగాణారాష్ట్రమే గమ్యమనీకూడా ఆయన స్పష్టీకరించాడు.

కాని, చెన్నారెడ్డి ఢిల్లీనుంచి పలికినట్లు వినవచ్చే వృత్తాంతంలో ఆ కరుకుదనం కన్పించడంలేదు. ఇదొక వుపాయం కావచ్చును- ఆఖరున కార్యసాధనకై. ఇందిరా గాంధీతో తన సంప్రదింపుల పర్యవసానం తెలంగాణా ప్రజలకు తృప్తికరంగా వుండగలవనే ఆశాభావాన్ని ఆయన వెల్లడించాడు. తెలంగాణా ప్రజల వాంఛ గత 28 నెలలుగా ఆందోళనద్వారా, వోటింగ్ ద్వారా స్పష్టమైనదనికూడా ఆ ప్రకటనలోనే తెలియజేశాడు. ప్రత్యేక తెలంగాణా, అందువలన, నిర్మాణం చేయవలెననే వాక్యం మాత్రం ఆయననోట వెల్వడలేదు. ఆయన అభిప్రాయంలో ఆ విధంగా వెల్వడవలసిన ప్రత్యేకావసరం లేదేమో? భావగర్భితంగా పలికితే చాలదా?

చెన్నారెడ్డికోసం (అనగా ఆయన సూచించే ప్రతిపాదనకోసం) ప్రధానమంత్రి ప్లానింగ్ మంత్రి సుబ్రహ్మణ్యాన్ని, ఇతరమంత్రులను కొందర్నీ రప్పించి చర్చ జేసింది. చెన్నారెడ్డి రాష్ట్రపతిని కలిసినాడు. ప్లానింగ్ మంత్రిని అంతకుముందే కలిసినాడు.

కొందరు పరిశీలకుల అభిప్రాయంలో ఈ చర్చలు పరిష్కారానికి అనువుగా వున్నవట. కేంద్రంలో బలంగావున్నవ్యక్తి-ఉద్యమాన్ని శక్తివంతంగా నడిపి బలాన్ని పుంజుకునివున్నవ్యక్తి కలిసి చర్చిస్తున్నారు గనక ఏదోఒకదారి కన్పిస్తుందట.

ఈ మధ్యలో చెన్నారెడ్డి వుద్యమాన్ని విరోధించిన తెలంగాణావారు, ఆంధ్ర-రాయలసీమ మండలాలవారూ, ఉద్యమాన్ని అణిచిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-వీరంతా ఏమీ మాట్లాడవలసిన పనిలేదా? వీరితో ప్రసక్తి లేనేలేదా- చెన్నారెడ్డితో అనగా తెలంగాణా ప్రజాసమితితో సమాధాన పడడానికి?

తెలంగాణాస్టేట్ లేక దాని సారాంశం సిద్ధించితీరుతుందని మేమేనాడో జోస్యం చెప్పిన సంగతి పాఠకులెరుగుదురు. మా జోస్యానికి ప్రబలమైన కారణాలనూ తెల్పినాము. అందువలన తెలంగాణాస్టేట్ రాకుండా జేయవలెననే వుద్దేశ్యంతో మేమీ పంక్తులు వ్రాయడంలేదు.

కాని, ఏ ఉద్యమాన్ని పరిష్కరించడానికైనా ఒకపద్ధతి వున్నది. ఏ పద్ధతిలోనైనా రాజకీయం వుండితీరుతుంది. ఆఖరుకది రాజకీయ పరిష్కారమే అవుతుంది. కాని ఎటువంటి రాజకీయం? ఒకవ్యక్తి లేక కూటం పవర్ గట్టిగా చేబట్టి వుండడానికి వీలైనట్లుచేసే రాజకీయమా? లేక సర్వాంధ్ర ప్రజానీకపు భవితవ్యందృష్ట్యా లక్ష్యమయ్యే రాజకీయపంథా రాజకీయమా?

మేమెన్నడో చెప్పినాము. రాధాకృష్ణ, గిరి, వంటి పెద్దలసమక్షంలో ఆంధ్ర-రాయలసీమ- తెలంగాణాల ఆదరణీయులైన ప్రజానాయకులు కూర్చొని ఈ సమస్యను చర్చించి సర్వసమ్మతంగా వుండే ప్రతిపాదనను ప్రసాదించవలసిందని హెచ్చరించినాము. ఇటువంటి హితవులు ఈ రాజకీయపుసీజన్‌లో అరణ్యరోదనాలు. అందువల్లనే మనం ఎక్కడ వుండవలెనో అక్కడే వున్నాము.

ఇక ఆలోచించుకోవలసింది ఆంధ్రా-రాయలసీమ వాస్తవ్యులుగాని తెలంగాణా వారుకాదు. ప్రత్యేకరాష్ట్రం వద్దన్నవారూ, కావలెనన్నవారూ కలిసిపోయి తమ రాష్ట్రాన్ని లేక తత్తుల్యాన్ని చక్కదిద్దుకుంటారు తెలంగాణాలో. మిగిలినవారు ఏక గవర్నర్ శాహిలో అనగా ఏక రాజధానిలో వుండడానికి సమ్మతిస్తారా?

——

పసిరికలు—
—కామెర్లు
భయపడవనిలేదు
డాక్టర్ సి. రామయ్యంగార్
రంగనాయకులపేట - నెల్లూరు.

## నూరేళ్లనాటి నెల్లూరు సంగతులు

# నెల్లూరులో కాలేజి నడపబోతున్న వేణుగోపాలస్వామి దేవాలయం

### —కొన్ని చరిత్రాంశాలు

నెల్లూరు మూలపేట వేణుగోపాలస్వామి దేవాలయంతరఫున వొక ఆర్ట్సు కాలేజిని నిర్వహించేందుకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంవారు 'గ్రీన్ సిగ్నల్' ఇచ్చివేశారు. రాష్ట్ర ప్రభుత్వం లాంఛనంగా అందుకు అంగీకరించవల్సి వుంది. ప్రభుత్వ గ్రాంట్లులేకుండా దేవాలయాదాయంనుండి కాలేజిని నిర్వహించుకునేపనైతే మాకాక్షేపణలేదనే అంగీకార పత్రాన్ని రాష్ట్రప్రభుత్వాన్నుండి పొందగానే కాలేజి అవతరణకు ఏర్పాట్లు జరుగుతాయి. ఆ అంగీకారాన్ని తెచ్చుకునేందుకు దేవాలయ మేనేజింగ్‌ట్రస్టీ ఆనం వెంకటరెడ్డిగారు (నె. ము. ఛేర్మన్) మొన్న హుటాహుటిన శనివారం హైదరాబాదుకు పయనమై వెళ్లారు ఆయన ఏంచేసుకొని వొచ్చిందీ ఇంకా తెలియలేదు. రాష్ట్రంలో తిరుపతి, అన్నవరం దేవస్థానాలతరఫున కాలేజీలు నిర్వహింపబడుతున్నపుడు వేణుగోపాలస్వామి దేవాలయంతరఫునమాత్రం

– సేకరణ –

**బం. గో. రె.**

కాలేజిని నడిపేందుకు ప్రభుత్వం ఎందుకు అంగీకరించదు? ఏమైతేనేం – నెల్లూరు వైద్యులు కాలేజి ప్రతిపాదనతో పోటీగా– ఐహంకాలంగా ఆలోచనలోవుండిన వేణుగోపాలస్వామి కాలేజికి మంచిరోజులొచ్చినట్లే కనపడుతున్నది నెల్లూరుకు మూడో కాలేజి వచ్చేయోగం వున్నట్లున్నది.

ఈ సందర్భంగా ఈ వేణుగోపాలస్వామి ఆలయ చరిత్రను 'హైలైట్' చేయదలచాము. ఈ వేణుగోపాలాలయ ప్రతిష్ఠ జరిగి నూరేళ్లుకూడా సరిగానిండని ఇటీవలి దేవాలయమే అయినా దురదృష్టవశాత్తు దీనికి సంబంధించిన సమగ్రమైన చరిత్ర సరిగా తెల్పరావడంలేదు. రేపు 1973 నాటికి ఈ ఆలయానికి నూరేళ్ళు నిండి 'సెంటినరీ' జరగబోతున్నది గనుక ఆ సందర్భాన్ని పురస్కరించుకొనైనా ఈ దేవాలయానికి సంబంధించిన సమగ్రమైన చరిత్ర కాలగర్భంలో కల్పిపోయి గాలికి పోకుండా సేకరించి గ్రంథస్థంచేయించడం ఇప్పటి ధర్మకర్తల కనీస కర్తవ్యంకాదా?

దొరికిన 'సోర్సు'నుబట్టి జర్నలిస్టిక్ ధోరణిలో ఈ దేవాలయ చరిత్రను ఈ సందర్భంగా సంక్షిప్తంగా నివేదించడమే ఈ విలేఖరి వుద్దేశ్యంగా పెట్టుకున్నాడు. 1873 లో ముద్రింపబడిన బాస్వెల్‌గారి 'నెల్లూరు మాన్యువల్' లో ఈ దేవాలయ ప్రస్తావనే కానరావడంలేదు. 1942 లో ప్రచురింపబడిన 'నెల్లూరుజిల్లా గెజిటీర్'లో ఈ దేవాలయాన్నిగూర్చి ఈ క్రింది విశేష ప్రస్తావన కనపడుతుంది:".... "Sri Venugopala swami Temple. is one of the richest temples in the town, though of recent origin, and its festivals are celebrated with great pomp" ఇటీవలకాలంలో ఏర్పడినదైనా నెల్లూరులో వున్న ధనవంతమైన దేవాలయాల్లో ఈ వేణుగోపాలస్వామి ఆలయం పేర్కొనదగింది, దీని బ్రహ్మోత్సవాలు విశేషా వేడుకగా జరుగుతాయి. ఇంతకుమించి ఇంకేవివరమూ అందులో మనకు కానరాదు.

1907 లో 'నెల్లూరు మూలపేటలో వేంచేసియుండు శ్రీ వేణుగోపాలస్వామి వారి స్థలమహాత్మ్యము' అనేపేర శ్రీమాన్ అద్దంకి వంగిపురం రామానుజాచార్యుల వారి శిష్యులైన తేనాంపేట తిరువేంగడ రామానుజదాసుగారు రచించి ప్రచురించిన 20 పేజీల స్థలమహాత్మ్యంలో అభూతకల్పనలతోనిండిన పుక్కిటి పురాణగాథలుతప్ప చరిత్రకు సంబంధించిన సరుకు యెంత వెతికినా కానరాదు. పౌరాణికదృష్టితప్ప చరిత్రదృష్టి మనకు యింకా ఏర్పడలేదు గదా! ఈ స్థలమహాత్మ్యాన్ని ప్రతీవల దేవస్థానం ధర్మకర్తలు పునర్ముద్రించారు కానీ యింకా ఎందువల్లనో విడుదలచేయకుండా రహస్యంగా పెట్టివున్నారు. 20 పైసల ఖరీదైన ఈ స్థలపురాణానికి అఖరులో అనుబంధంగా నాలుగు పేజీల 'ఆలయ చరిత్ర'కూడా జతచేసి ముద్రించారుకానీ, ఈ ఆలయ ప్రతిష్ఠాపనకు మూలకారకులై, దీని నిర్వహణకు ఎవరి యావదాస్తి అయితే కైంకర్యం గావింపబడిందో ఆ మహనీయులైన కంబాలత్తుని పాపిరెడ్డిగారికన్నా, తమ యిరవైవొకటవ యేటనే దీనికి ధర్మకర్తలయిన కి. శే. ఏ. సి. సుబ్బారెడ్డి, వారి సంబంధీకుల ప్రస్తావనే ప్రముఖంగా చొప్పింపబడింది. ఇది చరిత్రను తారుమారుచేయడమే అన్పించుకొంటుంది.

అయితే అదృష్టవశాత్తు పేరెన్నికగన్న చిరస్మరణీయులైన చరిత్రకారులు కీ శే. ఒంగోలు వెంకటరంగయ్యగారు 1936 జూన్ 'సుబోధిని' పత్రికల్లో "కొందరు నెల్లూరు గొప్పవారు" అనే బృహచ్ఛీర్షిక క్రింద కంబాలత్తుని పాపిరెడ్డిగారి చరిత్రను గూర్చి సుదీర్ఘమయిన వ్యాసాన్ని వ్రాసి పోయారుగనుక అందులో ఈ ఆలయ చరిత్రకు సంబంధించిన కొన్ని అస్తికలు మనతరంవారికి దక్కగల్గాయి.

ఒకతరం గడిచిపోయి ఇంకోతరం వచ్చేసరికే జరిగిపోయిన చరిత్ర తెలిసే మార్గమే లేకుండాపోతున్నది మనకు. ఉదాహరణకు నెల్లూరు ట్రంకురోడ్డు నడిబొడ్డున కాఫీ ఆలయంగావుంటున్న పూర్ణాక్యాంటీన్, నిర్మలవక్కపొడి, పెన్‌కార్నర్, పూర్వపు బాలాజి టిఫిన్‌ఫండ్ వగైరా షాపుగదుల స్థలం, ఇంకా అవతల సిటీమెడికల్సువున్న ట్రంకురోడ్డు స్థలం– ఇవ్వటికీ ఈ వేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన ఆస్తిలోనిదిగానే పరిగణలోవున్నదని ఎంతమందికితెల్సు? ఈమొత్తంట్రంకురోడ్డుషాపులన్నిటిమీదకల్సి బాడుగ నెలకు 400 రూపాయలకుమించడంలేదని ఎంతమందికి తెల్సు?అందుకనే వొక ప్రముఖ జర్నలిస్టు అన్నాడు:– Never underestimate the reader's intelligence, or overestimate his information- అనేవాక్యం జర్నలిజంలో వొక నానుడిగా నిల్చిపోయివుంది.

మహనీయుడు కంబాలత్తుని పాపిరెడ్డిగారు ఈ దేవళాన్ని కట్టించి అందులో వేణుగోపాలుణ్ణి ఏ శుభముహూర్తాన ప్రతిష్ఠించారోకానీ ఇంతవరకు ఈ వేణుగోపాలస్వామి సన్నిధిన ఎన్నివేల వివాహాలు జరిగాయో లెక్కలేదు. దేవాలయ నిర్వాహకులు లెక్కలు తీసుండకపోవచ్చుగాని ఈ నూరేళ్ళలో దాదాపు లక్ష వివాహాలైనా జరిగుండొచ్చునని వూహించుకోవచ్చు. ఈదేవాలయం ఎప్పుడూ నిత్య కళ్యాణం పచ్చతోరణంగా నెల్లూరు వారికి బృహత్కళ్యాణమంటపంగా వుంటూ వస్తున్నది. ఏకముహూర్తంలో 6 పెండ్లిండ్లు జరిగేందుకు వీలుగా ఆరువిభాగాలసత్రాన్ని నిర్మాణంచేశారు. రోజుకు ఇరవై ముప్పై వివాహాలు జరిగిన సందర్భాలు కూడా లేకపోలేదు.



1878 లో స్వర్గీయ కంబాలత్తుని పాపిరెడ్డిగారు ప్రతిష్ఠాపన చేయించిన నెల్లూరు మూలపేట వేణుగోపాలాలయం ఎదురుగా ఆయనే కట్టించిన ముఖమండపం—ఈ మండపంలో ఆగ్నేయదిశన స్తంభంమీద చెక్కబడివున్న స్త్రీ పురుష విగ్రహాలు పాపిరెడ్డి దంపతుల బొమ్మలనే చెప్తారు. (ఫోటోలు: సి. రాధాకృష్ణ ఎం. ఎ.)



వేణుగోపాలస్వామికి ప్రణమిల్లుతున్నట్లుగా ముఖమండప స్తంభం మీద చెక్కబడివున్న ఆలయ నిర్మాతలు కంబాలత్తుని పాపిరెడ్డి దంపతుల శిలావిగ్రహం.

గడిచిన శ్రీముఖ (1933-34) సంవత్సరానికి ముందు అరవై ఏళ్ళక్రితం శ్రీముఖ నామ సంవత్సరం (1873-74) జ్యేష్ఠ మాసంలో కంబాలత్తుని పాపిరెడ్డిగారు 'శ్రీ రుక్మిణీ సత్యభామాసమేత శ్రీ వేణుగోపాలస్వామి ప్రతిష్ఠ జరిగించి గోపుర ప్రాకారాలతో గొప్ప ఆలయమును నిర్మించినారు'– అని కీ శే. ఒంగోలు వెంకటరంగయ్యగారు పేర్కొన్నారు. జ్యేష్ఠమాసమంటే సాధారణంగా మే జూన్ నెలల్లో వస్తుంది. కానీ ధర్మకర్తలు అచ్చొత్తించివున్న ఆలయచరిత్రలో గోకులాష్టమి నాడు ప్రతిష్ఠాపన జరిగినట్లు తెలిపివున్నారు. గోకులాష్టమి సాధారణంగా శ్రావణమాసం (ఆగష్టు) లో వస్తుంది. అంటే ఈ దేవాలయ ప్రతిష్ఠాపన 1873 జ్యేష్ఠమాసంలోనా, శ్రావణమాసంలోనా అనే సందేహానికి తావుకల్గుతున్నది. ఏదిఏమైనా నిగ్గుతేల్చి వ్రాయడంలో దిట్ట అయిన ఒంగోలు వెంకటరంగయ్యగారి వ్రాతే నికార్సయినదిగా వుంటుందికాబట్టి శ్రీముఖనామ జ్యేష్ఠమాసంలో అంటే 1873 మే- జూన్ నెలలోనే ఈ ఆలయ ప్రతిష్ఠాపన జరిగుంటుందని అనుకోవచ్చు.

ఈ ప్రతిష్ఠకు పూర్వవృత్తాంతం చాలా వుంది. కంబాలత్తుని పాపిరెడ్డిగారు శైవులు. నెల్లూరులో పురాణాలయమైన మూలపేట మూలాస్థానేశ్వరాలయ ధ్వజస్తంభం శిథిలమైవుంటే పాపిరెడ్డిగారే నూతన ధ్వజప్రతిష్ఠ చేయించారు. దేవాలయ స్తంభములకు పంకరవేయించి ప్రాకార మండపాదులతో అందంగా తిరిగి కట్టించి గోపుర నిర్మాణం కూడా పూర్తిచేయించారు. అంతేకాక భువనేశ్వరిదేవి ఆలయ పునర్నిర్మాణం గావించారు. అంతేగాక ఈ శివాలయానికి సమీపంలో వున్న తీర్థరాజమైన పుష్కరిణికి (కోనేరుకు) రాతికట్టడం కట్టించి మెట్లు పెట్టించి మనోహరంగా చేయడమేగాక చెరువుకాల్వనుండి యీ కోనేరులోకి కొత్తనీరువచ్చేదానికి పాతనీరు పొయ్యేదానికి తూములుకూడా పెట్టించారు. ఇప్పటికీ ప్రతిసంవత్సరం ఈ కోనేట్లోనే మూలస్థానేశ్వరుడి వుడుపోత్సవలీల (తెప్పవుత్సవం) జరుగుతుంటుంది. ఈ దేవాలయానికి ఎదుట రెండు నిలువుల గణపతి విగ్రహాన్ని గ్రామరక్షగా నిర్మించిందికూడా కంబాలత్తుని పాపిరెడ్డిగారే.

పాపిరెడ్డిగారుశైవులైనా, ఆయన శైవం ఒంగోలు వెంకటరంగయ్యగారన్నట్లు– 'వైష్ణవద్వేషకర దీక్షాదుష్టంకాదు'. చదువు సంధ్యలులేని పాపిరెడ్డిగారికి వ్రాతపనియందు సహాయకులుగావుండిన బోడిరెడ్డి రంగారెడ్డి తండ్రిగారైన రామిరెడ్డిగారితో స్నేహమేర్పడి– యీ రామిరెడ్డి పరమ వైష్ణవులైనందువల్ల ఆయన ప్రేరణతో పాపిరెడ్డిగారు ఈ వైష్ణవాలయాన్ని నిర్మించినట్లు పేర్కొనబడింది.

మొదట మూలవిగ్రహాన్ని చెయ్యి ముఖంగా వుంచడమా లేక దక్షిణాముఖంగా చేయడమా అనేవిషయమై పెద్ద వివాదం వచ్చినట్లున్నది. తూర్పు ముంగమయ్యేట్లయితే పృష్ఠభాగం మూలస్థానేశ్వరుని తట్టవుతుందని, అది శాస్త్రవిహితం కాదని వాదోపవాదాలు జరిగినట్లున్నవి. ఈవివాదాలమధ్య– దేవాలయ ప్రతిష్ఠాపన కోసం తెప్పించిపెట్టిన రాతిదూలాల మొదలైనవి నెల్లూరు నవాబుపేట మల్లికార్జునస్వామి దేవాలయానికితరలించి అక్కడ వొక చిన్న గోపురం కట్టించారట.

అటుపిమ్మట పాపిరెడ్డిగారెవ్వరో చెప్పినట్లు ఇప్పుడుండేవిధంగా ఈ వేణుగోపాలస్వామి దేవస్థానాన్ని దక్షిణాభిముఖంగా ప్రతిష్ఠచేయించారట. ఈ దేవాలయంలోని శిలావిగ్రహాలన్నీ పత్తేకాన్‌పేటలో వుంటుండే అంకాలత్తునినే శిల్పాచార్యుని చేత తయారుచేయించినవేనట. తర్వాత ఈ దేవాలయ గోపురానికి శంకుస్థాపన పాపిరెడ్డిగారే జరిపించి గోపుర ద్వారాన్ని మాత్రం పూర్తిచేయించ గలిగారటగాని, పై అంతస్తుల్ని, అందులోని చిత్తరువుల్ని పాపిరెడ్డి మరణానంతరం బోడిరెడ్డి రంగారెడ్డి ప్రత్యేకంగా పూర్తిచేయించారట.

ఈ గోపురానికి ఎదురుగా దక్షిణాన వుండే ముఖమండపంకూడా పాపిరెడ్డిగారి ధర్మమేనట. ఈ మండప స్తంభాల్లో ఆగ్నేయదిక్కునవున్న స్తంభంమీద పుత్తరముఖంగా చెక్కబడివున్న స్త్రీపురుష విగ్రహాలు పాపిరెడ్డి దంపతుల బొమ్మలని చెప్పుకుంటున్నట్లు వెంకటరంగయ్యగారు పేర్కొన్నారు.

ఇట్లా వొక్కవ్యక్తి దైవభక్తి పరాయణతతో ఇన్ని భూరి సత్కార్యాలు చేయడం అరుదైనవిషయం. అంతేకాదు ఆయన మరణాంతర్యాత కొన్ని యాదృచ్ఛిక ఘటనలవల్ల తనుకట్టించిన ఈ వేణుగోపాలస్వామి దేవాలయానికే లక్షలు విలువచేసే తన యావదాస్తి కూడా సంక్రమించడం అపురూపమైన విషయమేకదా. ఈ వైనాలన్నీ వచ్చేవారం తెల్సుకుందాం.

నూరేళ్ళ ఇటీవలికాలానికి చెందిన ఈ పాపిరెడ్డిగార్నిగూర్చి, ఆయన చరిత్రను గూర్చి వ్రాతమూలకమైన ఆధారాలు లేకుండాపోవడం శోచనీయమైన అంశం. పాపిరెడ్డిగారు తనకాలంలో చాలా పలుకుబడి గలిగిన ప్రసిద్ధులుగా పేరెన్నికగన్న వ్యక్తే అయినా ఆయన అక్షరాస్యులుగారని, నిరాడంబరుడుగా చేవ్రాలుతోనే తన కార్యాన్ని నడిపించుకున్నవ్యక్తి అని తెల్సుకున్నప్పుడు

—తరువ 10 వ పేజీలో

## పంచాంగం

### గురుశని సమసప్తకం

1972 జనవరి 6 తేదివరకు గురు, శని సమసప్తకం. ఇట్టు పరిపాలన, ప్రజా జీవిత ఇక్కట్లు, క్షామ, విషము, అగ్నిపాతముతో కూడియున్నది

### వృష్టి

జూన్ 6 తేది మొదలు 22 తేది లోగా వాయుసహిత వర్షపాతము

### ఏరువాక

జూన్ 8 తేది ఏరువాక పూర్ణిమ, వృషభపూజ.

### మృగశిరకార్తె

జూన్ 8 తేది పగలు 9-21 గంటలకు మృగశిరకార్తె ప్రవేశం.

### జూన్ తిథులు

| | | | |
|---|---|---|---|
| 5 శని | ద్వాదశి | రా 2-07 | గం ప. |
| 6 ఆది | త్రయోదశి | రా 3-27 | ,, |
| 7 సోమ | చతుర్దశి | తె 4-26 | ,, |
| 8 మంగళ | పూర్ణిమ | తె 4-59 | ,, |
| 9 బుధ | కృష్ణపాడ్యమి | తె 5-06 | ,, |
| 10 గురు | విదియ | తె 4-39 | ,, |
| 11 శుక్ర | తదియ | రా 3-42 | ,, |

—నిమ్మగడ్డ వెంకటేశ్వరశాస్త్రి

## జనవాణి

(2వ పేజీ తరువాయి)

టికీ తెచ్చుకునేదెట్లా? ఇక్కణ్ణుంచి టికీ పట్టుకుని వెళ్ళేసరికి అక్కడ కొందరు మనుషులు 'ఆక్రమి' చేసుకొనుంటే ఎట్లా? ఈ అలందర నిర్వాహణను చక్కదిద్దేమార్గం లేదా?

నెల్లూరు. —కె. సి. ఎస్. రెడ్డి.

▲

### విద్యుచ్ఛక్తి బిల్లులు— ఉద్యోగస్థుల జబర్దస్తీ

ఈ విషయమై గత వారం జమీన్ రైతులో 'మార్చి బిల్లులు చెల్లించనివారి ఫ్యూజులు పెరుక్కొని రమ్మన్నారట! అంతే, వాళ ఉద్యోగివచ్చి చెప్పేది విన కుండానే దురుసుగా జబర్దస్తీగా పెరుక్కొని పోయారట... కొందరికైతే 1968 సం వత్సరంలోది బాకీ అని, అదికూడా చెల్లిం చనిదే కనెక్షన్ ఇవ్వం పొమ్మన్నారట'— అని వ్రాశారు.

ఆ మందభాగ్యుల్లో నేనొకణ్ణి. ఎంత దబ్బు మార్చినెలకు నేను చెల్లించాల్సింది నాకు తెలియదు, మార్చి బిల్లు జారీ చేయ లేదుగనుక. ఏదో ఎన్. జి. వో. ల సమ్మె మూలంగా ఈ మార్చినెల బిల్లు ఏప్రెల్‌లో రాలేదుగాబోలు ననుకొంటూవున్నాను. ఈ లోగానే ఆ మొన్నటిరోజున వున్నట్టుండి ఫ్యూజు పెరుక్కొని పోయారు. ఘనత వహించిన విద్యుచ్ఛక్తి ఆఫీసుకు ఫోన్ చేసి మార్చిబిల్లు మొత్తం రూ 13–55 పై. మనియార్డరుకట్టి మరునాడు ఫ్యూజుకోసం ఆఫీసుకుపోతే అప్పుడు చాట భారతంతీసి 1968 సంవత్సరం ఆగస్టు నెల బిల్లు రూ. 15–60 కూడా నేను కట్టాల్సివుందని, అది కట్టనిదే ఫ్యూజు ఇవ్వ బడదని చెప్పారు. ఇదేంటి అన్యాయం అని గుంజె బాదుకోవాల్సివచ్చింది 1968బాకీని మూడేళ్ళ తర్వాత కట్టమనడం ఏమి న్యాయం? ఇంతకాలం దాన్ని కట్టించుకో కుండా ఈ ఘనత వహించిన విద్యుత్ శాఖాధికారులు ఏం చేస్తుండినట్టు? గాడి దలు కాస్తుండినారా? —అని అనుకుంటూ ఇంటికొచ్చి నేను ఫైలు చేసిపెట్టిన కాగితా లను వెతికిచూస్తే ఆ 1968 సంవత్సరం ఆగస్టు బిల్లు పోస్టల్ రసీదు, మనియార్డరు అక్నాలెడ్జిమెంటు కనపడ్డాయి. బ్రతుకు జీవుడా అని అవి పట్టుకుని మళ్ళీ ఆ ఘనత వహించిన ఆఫీసుకెళ్ళి చూపిస్తే గుమాస్తా గారు గొణుక్కుంటూ—మాదే పొరపాటండీ, పొరపాటున లెక్కలో జమవేశాదు —అని ఫ్యూజు కాగితం ఇప్పించి పంపారు. మీరు వ్రాసినదానిబట్టిచూస్తే ఇట్లాంటి పొరపాటు కేసులు చాలా వున్నట్టు తెలుస్తున్నది. చూస్తుంటే ఈ ఎలక్ట్రిసిటీ ఆఫీసు అందర్ దర్బారుగా వున్నట్టున్నది. ఇంత అబంద రగా ఆఫీసులు నడుస్తుండేది ఈ భారత దేశంలోనేనని పిస్తున్నది! దీనికి నిష్కృతి లేదా? అయ్యా విద్యుచ్ఛక్తి శాఖాధిగారూ విదారించి పరిస్థితి చక్కపరచలేరా?

నెల్లూరు ఎస్. వెంకోబరావు (హెచ్. ఎస్. నెం. 1050)

▲

### కొత్త కాలేజి

నెల్లూరికి కొత్తకాలేజి ఏర్పడ్డం మంచిదే కాని వందలకొలంది ప్రజలకు ఇంతకాలం అత్యంత అవసరమైన వివాహాది శుభ కార్యాలకు అనువుగా వుంటుండిన శ్రీ వేణు గోపాలస్వామి దేవాలయంవారి సత్రాలను కాలేజికి వినియోగించడం ఆవును చంపి చెప్పులు దానం చేసినట్టు వుంటుంది దేవా లయాలను దేవాలయాలే దిగమ్రింగే వారికి ఈ అవసరం కనపడకపోవచ్చు. ఇటువంటి అనాలోచిత అక్రమ కార్యాల వల్లనే ప్రభుత్వానికి చెడ్డపేరు రావడం. దీన్ని తలపెట్టిన పెద్దమనుష్యులు తిక్క వరపు రామిరెడ్డివంటి ధర్మాత్ములతో సంప్రతించి వేరు స్థలాలను, కట్టడాలను వెతకడం సమంజసం.

నెల్లూరు —వెన్నెలకంటి రాఘవయ్య

## వేణుగోపాలస్వామి

(9 వ పేజీతరువాయి)

ఆశ్చర్యంవేస్తుంది పుస్తకజ్ఞాన పాండిత్య సహాయం లేకపోయినా ఆ రోజుల్లో అన్ని మధ్యస్థాలు వీరు వేస్తుండినవేనట. 1864 ప్రాంతాల్లో నెల్లూరు శ్రీ రంగ నాయకులస్వామి దేవాలయ అర్చకులకూ, ఆలయ అధికారులకూ వచ్చిన వివాదాల్లో వీరొక మధ్యస్థులుగా వుండినట్టు ఆ దేవ స్థానపు పాతకాగితాలవల్ల తెలుస్తున్నదని ఒంగోలు వెంకటరంగయ్యగారు వ్రాశారు. ఈ పాత కాగితాలు ఇప్పుడూ వున్నాయా?

పాపిరెడ్డిగారికి పారంపర్యమైన గ్రామాధికారమేమీ వుండినట్టు లేదుగానీ నెల్లూరులోని సర్వాధికారాలు ఈయనవి గానే చెప్పుకున్నారు. నెల్లూరు చెరువు క్రింది నీటిపారుదల అంతా వీరి మాటమీదే జరుగుతుండినదట. ఈ విషయాల్లో ఏ అధికారికూడా ఈయన్ను అతిక్రమించ జాలకుండినట్టు చెప్తారు తన కాలంలో ఈయన ఇంత గొప్పగా వెలిగాడుగాబట్టే ఈయన వెలయింపచేసిన ఈవేణుగోపాలా లయమూ ఇతర్ల పేరుమీదుగానైనా ఇంత గొప్పగా వెలుగొందుతున్నది. రేపు రాబోయే కాలేజికి వేణుగోపాలస్వామి కాలేజి అనేపేరు గాకపోయిన పక్షంలో కంటాబత్తుని పాపిరెడ్డి కాలేజి అని పేరు పెట్టడమే సముచితంగా వుంటుంది.

(తరువాయి మరువారం)

## లోకవృత్తం

(3 వ పేజీ తరువాయి)

ప్రపంచానికి మేలైన సంగతి మరొక టున్నది. యుద్ధసామగ్రి తగ్గింపు. సైనిక దళాల తరలింపు, తగ్గింపు. ఇటీవల ఇతరదేశాలలోని సైనికదళా లను రాజ్యాలు కొన్ని తగ్గించుకుంటే మంచిదని సోవియట్ యూనియన్ కోరితే, లేశమైనమాటగా దానిని అమెరికా స్వీకరిం చింది. వాతావరణం శాంతిమయమై పోయేట్లు కనిపించినది.

అంతలోనే ఒక దుర్వార్త. సోవియట్ యూనియన్ తన దళాలను పెంచుతున్న దని తెలిసిందని ఆరోపించి, అందుకుగాను తమ దళాలను అధికం చేయవలెనని పశ్చిమ యూరప్ నాటో రాజ్యాలు తీర్మా నించినవి.

అరబ్ రిపబ్లిక్‌లోకి శక్తివంతమైన యుద్ధసామగ్రి రష్యానుంచి వచ్చి చేరింది గనుక మధ్యధరా సముద్రప్రాంతంలో రాజ్యాల ప్రాబల్య సరళి మారింది-కేవలం ఇస్రాయిలును ఎదుర్కొడానికే ఆ సామగ్రి అక్కడకు రాలేదు అందువలన హెలికాప్ట ర్లను మోసే వాహనాలను, ఆకాశాన గస్తీ తిరిగే సాధనాలను అమెరికా పంపుతుం దని ఆ దేశపు రక్షణమంత్రి నాటో సమా వేశంలో తెలియజేసి, మిత్రమండలి సాయం కోరినాడు.

అమెరికన్ యుద్ధ నౌకలతోపాటుగా బ్రిటిష్, గ్రీక్, టర్కిష్ యుద్ధనౌకలు పిల్చి పిల్వకముందే మధ్యధరా ప్రాంతానికి రావ డానికి సిద్ధంగా వుంటవని నాటో రాజ్యాలు హామీ యిచ్చినవి.

అందువలన, మూడవ ప్రపంచసీమల పట్ల అగ్రరాజ్యాల వైఖరి వివేకయుక్తంగా వున్నా, పరిస్థితి తమ చెయిదాటిరాకుండా చూచుకోడానికి పెద్దరాజ్యాలు జాగ్రత్తపడుతున్నవి.

యుద్ధ సామగ్రినీ, సైనిక - నౌకా-వైమా నిక దళాల స్థావరాలనూ తగ్గించవలెనని అంటూనే, మొగ్గలో భేదం రాకుండా రాజ్యాలు కాపాడుకోవలసియున్నది. ఇందు మూలంగానే ఆ రాజ్యాలు ప్రపంచశాంతిని రక్షిస్తున్నవి; అదీ ప్రస్తుత పరిస్థితి!

## ఈ వారం విశేషాలు

(2వ పేజీతరువాయి)

కాంగ్రెస్ స్వతంత్రుడు భోలాపశ్వాన్‌శాస్త్రి పట్టంగట్టారు. ఈకలగాపులగమంత్రాంగం ఎంతకాలం పూరేగుతుందో చూడాలి. తమకు మొత్తం అసెంబ్లీలలం 318 మందికి గాను 170 మంది అండ వున్నదంటు న్నారు. ఇది ఆఖరుదాకా నిలకడగా నిల్చే దని అనుకోడానికి వీల్లేదు. కర్పూరీ ఠాకూర్ రాజీనామా సమర్పిస్తూ అసెంబ్లీని రద్దుచేయమని గవర్నరుకు సిఫారసుచేస్తే ఆ మహానుభావుడు ఈ కలగాపులగపు ఏర్పాటుకు అంగీకరించాడు. అసెంబ్లీని రద్దుచేసిపారేసి కొంతకాలం ప్రెసిడెంట్ పాలన విధించివుంటే భ్రష్టుపట్టిన బీహార్ రాజకీయాల తిక్క కుదిరుండేదేమో!

మొత్తానికి ఇందిరమ్మ ఎదుటి పార్టీల వారి మంత్రి వర్గాలన్నీ మటుమాయమై పోతున్నాయి. ఆయమ్మ అదృష్టం అట్లా వుందిమరి!

● కొత్త కాంగ్రెస్‌వారు పంజాబ్‌మీద కన్నువేసి పెట్టున్నారు, కప్పంతక్కెడవ్యవ హారం అక్కడా ప్రారంభించదల్చినట్టు న్నారు. మొన్న జరిగిన అకాలీ శాసనసభ పార్టీసమావేశంలో వాళ్లంతా ఐక్యంగా వుండాలనితీర్మానించుకున్నారట. పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకాశసింగ్‌బాదల్ పట్ల సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించారట. మొత్తం 26 మంది మంత్రులూ తమ రాజీ నామా పత్రాల్ని ముఖ్యమంత్రిగారికి సమ ర్పించారట. ఆయన వీటిని తనజేబులో పెట్టుకుని వున్నారట. బాగుందీ పకడ్బందీ వ్యవహారం!

### జమీన్‌రైతు

| | |
|---|---|
| సంవత్సరం చందా | రు. 15–00 |
| 6 మాసములకు | రు. 8–00 |
| విడిప్రతి | రు. 0-30 |


గ్రామ్స్: SUTRACO ఫోన్: 128

SUDARSAN CHIT FUNDS. SCF

# సుదర్శన్ చిట్ ఫండ్స్

(సుదర్శన్ ట్రేడింగ్ కంపెని లిమిటెడ్‌వారి విభాగము)



సెంట్రల్ ఆఫీసు: మద్రాసు-14 రిజిస్టర్డ్ ఆఫీసు: కాలికట్-2.

## నెల్లూరు - బ్రాంచి

ఆఫీసును యిప్పుడున్న బిల్డింగ్సునుండి, గాంధీ విగ్ర హమునకు సమీపమున 15/1 సుబేదారుపేట రోడ్, నెల్లూరులోని బిల్డింగునకు 7–6–71 తేది మార్చు తున్నాము. మా ఖాతాదారులు గమనించ ప్రార్థన.

## త్వరలో పూర్తికావస్తున్న గ్రూపులు

| గ్రూపునెం | చీటీ విలువ | మొత్తం సభ్యులు | మొత్తం నెలలు | నెలసరి చందా |
|---|---|---|---|---|
| ఎ1 | రూ. 25,000 | 50 | 50 | రూ. 500 |
| ఎ3 | రూ. 10,000 | 50 | 50 | రూ. 200 |
| ఎ4 | రూ. 5,000 | 50 | 50 | రూ. 100 |


Edited, Printed and Published by N. Sree Ramamurthy at The Zamin Ryot Press, 170, Thipparajuvari Street, Nellore (A. P.)